# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :206 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శనివారం 19-10-2024 | పేజీలు:4 వెల: 2.00


## మాజీ మంత్రి హరీశ్ రావు బంధువులపై చీటింగ్ కేసు ..

హైదరాబాద్ : మాజీ మంత్రి, బీఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు బంధువులపై కేసు నమోదైంది. తన ఐదంతస్తుల భవనంలో హరీశ్‌రావు బంధువులు తన్నీరు గౌతమ్, బోయినపల్లి వెంకటేశ్వరరావు,గోని రాజ్‌కుమార్‌గౌడ్,గారపడి నాగరవి, జంపన ప్రభావతి, తన్నీరు పద్మజారావు అక్రమంగా ఉంటున్నారని బాధితుడు దండు లచ్చిరాజు మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.దీంతో ఆరుగురిపై మియాపూర్‌లో ట్రెస్‌పాస్, చీటింగ్ కేసు నమోదైంది. ఫోస్మో హాస్పిటాలిటీ పేరుతో ప్రామిసరీ నోటు తీసుకుని చీటింగ్‌కు పాల్పడ్డారని బాధితుడు తన ఫిర్యాదులో పేర్కొన్నారు.తనకు తెలియకుండానే వారు తన ఇంటిని అమ్మేశారని ఆరోపించారు. ప్రభావతి తనకు వ్యతిరేకంగా ఇంజక్షన్ ఆర్డర్ కూడా తెచ్చుకున్నారని పేర్కొన్నారు. లచ్చిరాజు ఫిర్యాదుపై ట్రెస్‌పాస్, చీటింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## అశోక్ నగర్ పేరు వింటేనే రేవంత్ రెడ్డికి భయమేస్తోంది..



హైదరాబాద్ : నిరుద్యోగుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడే అదే అశోక్ నగర్, నిరుద్యోగుల పేరు వింటే ఆయనకు భయమేస్తోందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి నిప్పులు చెరిగారు. రాష్ట్ర అప్పులు, గ్రూప్-1 అంశంతో పాటు మూసీ సుందరీకరణపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై జగదీశ్ రెడ్డి ధ్వజమెత్తారు.రేవంత్ వ్యాఖ్యలు సీఎం స్థాయిని దిగజార్చేలా ఉన్నాయి. రాష్ట్ర ప్రజల పరువు పోయేలా రేవంత్ ఉపన్యాసాలు ఉన్నాయి. రేవంత్ వ్యక్తిగా పరువు పోగొట్టుకుంటే ఫర్వాలేదు.. కానీ తెలంగాణ సీఎంగా పరువు పోతే ఎవరికి నష్టం..? ఎవరో రాసిచ్చిన పాఠం చదవడం రేవంత్ మానేస్తే మంచిది. సీఎం వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని జగదీశ్ రెడ్డి మండిపడ్డారు.తెలంగాణ ఆదాయాన్ని పెంచింది కేసీఆర్ అని జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. 2014 బడ్జెట్ ఇప్పటి బడ్జెట్ చూస్తే ఎవరు ఆదాయం పెంచారో తెలుస్తుంది. అప్పులు మంత్రుల జేబులో నుండి కడుతున్నట్లు అతితెలివిగా మాట్లాడుతున్నారు. మేము కూడబెట్టిన ఆదాయం నిలబడితే చాలు. 420 హామీలొద్దు.. కేసీఆర్ పథకాలైనా ఇస్తే చాలని ప్రజలు కోరుతున్నారు. రాష్ట్ర ఆదాయం , అప్పులపై చర్చకు సిద్ధమే అని జగదీశ్ రెడ్డి తేల్చిచెప్పారు.సెక్యూరిటీ లేకుండా సీఎం మూసీ ప్రాంతంలో తిరిగి చూపించాలిరగాలి. మూసీ కూల్చివేతల తరవాత సెక్యూరిటీ పెంచుకుని ప్రగల్భాలు పలుకుతున్నారు. అశోక్ నగర్ నిరుద్యోగుల వల్లే రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చారు. మరి ఇప్పుడు అశోక్ నగర్ పేరు వింటే రేవంత్‌కి భయమేస్తోంది. అశోక్ నగర్‌లో పోలీస్ నిర్బంధం దేనికి..? యువత ఆవేశం ఇలానే కొనసాగితే తెలంగాణ మొత్తం అశోక్ నగర్‌లే అవుతాయి. నిర్బంధం పెట్టే బదులు అనుమానాలు నివృత్తి చేయండి. కాంగ్రెస్ సీనియర్లే సీఎం ఏకపక్షంగా వెళ్తున్నారని అంటున్నారు. ఇప్పటికే ప్రజల నుండి దూరమౌతున్న రేవంత్.. తన దూకుడు మానుకోకపోతే కాంగ్రెస్ పార్టీకి దూరం కాక తప్పదని జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు.

## కేటీఆర్ తెలివిగా మాట్లాడుతున్నారు.. గుత్తా సుఖేందర్ రెడ్డి ఫైర్



హైదరాబాద్, మూసీ పై కేటీఆర్ చేసిన ట్విట్ కు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఫైర్ అయ్యారు. మనం చేస్తే సుందరీకరణ.. అవతలి వారు చేస్తే వేరేదా?అని ప్రశ్నించారు. మాజీ పట్టణాభివృద్ధి మంత్రి తెలివిగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్గొండ జిల్లా మూసీ ప్రక్షాళన పై బీఆర్ఎస్, బీజేపీ తీరును గుత్తా సుఖేందర్ రెడ్డి ఎండగట్టారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మూసీ ప్రక్షాళన ప్రాజెక్ట్ స్వాగతిస్తున్నానని తెలిపారు. గత ప్రభుత్వాలు కేవలం మాటలకే పరిమితం అయ్యాయని మండిపడ్డారు. మూసీ పరివాహక ప్రాంతాల ప్రజల కోసం నందనవనంలో గతం లోనే వేయికి పైగా ఇళ్లు నిర్మించి ఇచ్చారన్నారు. ఇవాళ రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొత్తగా ఏదో చేస్తున్నట్టు వ్యతిరేక ప్రచారం చేయడం కరెక్ట్ కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. యాదాద్రి, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో రైతులు వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారన్నారు. మాజీ పట్టణాభివృద్ధి మంత్రి తెలివి గా మాట్లాడుతున్నారని తెలిపారు. ఆయన వైఖరి చూస్తే ఆశ్చర్యం వేస్తుందన్నారు.ఆయన హయాంలో ఇష్టం వచ్చినట్టు గా భారీ అంతస్తులకు అనుమతులు ఇచ్చారన్నారు.డ్రైనేజ్, నాలాల వ్యవస్థలు గాలికి వదిలి వేశారని తెలిపారు. మనం చేస్తే సుందరీకరణ.. అవతలి వారు చేస్తే వేరేదా? అని ప్రశ్నించారు. ప్రత్యేక బోర్డు పెట్టి చైర్మెన్ ను కూడా పెట్టింది మీరే కదా? అని మండిపడ్డారు. ప్రజా సమస్యలపై ప్రతిపక్షాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. వాజ్ పాయ్ హయాంలో నదుల ప్రక్షాళన ఈటెల రాజేందర్ కు తెలియదా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రజలు ప్రతిపక్షాల తీరును ఎండగట్టాలన్నారు. అవసరం అయితే మూసీ ప్రక్షాళన కోసం ఉద్యమానికి దిగాలని తెలిపారు. ప్రత్యామ్నాయం చూపకుండా మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలను ఖాళీ చేస్తే ప్రశ్నించాలన్నారు. కానీ అందరికి పునరావాసం కల్పిస్తునప్పుడు ఆందోళన ఎందుకు? అని మండపడ్డారు. మూసీ ప్రక్షాళన పై పర్యావరణ వేత్తలు కూడా దృష్టి పెట్టాలని కోరారు. మూసీని జీవ నదిగా మార్చాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. ఏవి పరిశీలించకుండా మామూళ్లు తీసుకొని భవనాలకు అనుమతులు ఇస్తున్న మునిసిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

## అభివృద్ధి వికేంద్రీకరణ జరగకపోతే ప్రజల్లో వివక్షతా భావం పెరుగుతుంది..



హైదరాబాద్,ములుగు ఎన్నో ప్రత్యేకతలకు వేదిక.. అందరూ పర్యటించాలని పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షేమల శాఖ మంత్రి సీతక్క కోరారు.గ్రామాభివృద్ధికి సీఎస్ఆర్ ఫండ్స్ సేకరించాలని కోరారు. ఏసి గదిలో పనిచేసే మీరు అప్పుడప్పుడు అడవి గాలి పీల్చుకోవాలని తెలిపారు. ములుగుకి వచ్చి డిజిటల్ విద్య బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. మీరంతా గ్రామాలకు తరలండి%ొ%అటవీ గ్రామీణ పరిస్థితులను చూడాలని కోరారు. విద్యా వ్యవస్థ సరిగా లేనిచోట పర్యటించి ప్రణాళిక రూపొందించాలన్నారు. ఆదివాసి గిరిజన ప్రాంతాల విద్య అభివృద్ధికి కృషి చేస్తే దేవుళ్ళుగా మిమ్మల్ని ఆరాధిస్తారన్నారు. నోరులేని నిస్సహాయుకులకు వద్దకు వెళ్లండి.. ఒక్కో కంపెనీ ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకోవాలని పిలుపునిచ్చారు.అప్పుడు మీరే మార్పుకు నాంది పలికిన వారవుతారన్నారు. మనసుంటే మార్గం ఉంటుందన్నారు. చిత్తశుద్ధి, మంచి ఆలోచనలు ఉంటే కఠిన పరిస్థితులను అధిగమించగలుగుతామని అన్నారు. అటవీ శాఖ అభ్యంతరం పెడితే..కంటైనర్ ఆస్పత్రి, కంటైనర్ స్కూల్ ను ఏర్పాటు చేశారని తెలిపారు. ఒక మంచి పని చేస్తే జీవితంలో గొప్ప ఆనందం అనుభూతి మిగులుతుందన్నారు. పుట్టుకకు చావుకు మధ్య ఉన్న సమయాన్ని సమాజ మార్పు కోసం వెచ్చించాలన్నారు. చుట్టూ ఉన్న పల్లెను అభివృద్ధి చేస్తే ఆనందమే వేరన్నారు. ములుగు ఎన్నో ప్రత్యేకతలకు వేదిక. అందరూ పర్యటించాలన్నారు. ఏసి గదిలో పనిచేసే మీరు అప్పుడప్పుడు అడవి గాలి పీల్చుకోవాలని తెలిపారు. ములుగుకి వచ్చి డిజిటల్ విద్య బలోపేతానికి కృషి చేయాలన్నారు. మారుమల గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ విద్యను అందించటానికి మీరంతా ముందుకు వచ్చారన్నారు.సారం లేని భూమి విద్య లేని జీవితం ఒక్కటే అన్నారు. అందుకే విద్య అనేది చాలా ముఖ్యమని తెలిపారు. దేశ ముఖచిత్రాన్ని మార్చేది విద్యనే అన్నారు. సమాజంలో ఇంకా అంతరాలు ఉన్నాయన్నారు. విద్యా బోధనలో కూడా అంతరాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విద్యా అవకాశాలు ఆకాశానికి భూమికి ఉన్నంత తేడా ఉందన్నారు. మైదాన ప్రాంతాల, అటవీ ప్రాంతాల మధ్య విద్య విషయంలో ఎంతో వ్యత్యాసం ఉందని తెలిపారు. పట్టణ ప్రాంతాలకు మెరుగైన విద్య అందుతుందని అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడలేకపోతున్నారని తెలిపారు. అందుకే విద్యలో ఉన్నంతరాలను తొలగించాలన్నారు. సమానత్వ సాధన దిశలో విద్య కీలకం అని తెలిపారు. హైదరాబాద్ లో ఎలాంటి ఎడ్యుకేషన్ వుందో, మరుమల పల్లెలో అలాంటి విద్య ఉండాలన్నారు. ఆ దిశలో మా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గ్రామీణ విద్యార్థులు అవకాశం కల్పిస్తే బాగా రాణిస్తారన్నారు. కానీ వారికి అవకాశాలు వస్తువులు లేపటం వల్ల వెనుకబాటుతనానికి గురవుతున్నారని తెలిపారు. అందుకే గ్రామీణ విద్యా వ్యవస్థలో మార్పు తెచ్చేందుకు మా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.అందుకు మీ వంతు సహకారం అందించాలని కోరారు. సమాజంలో రెండు వర్గాలు ఉన్నాయని, ఉన్నత విద్యవంతులున్న.. సమాజంలో కనీస విద్యా లేనివారు సమాజంలో ఉండటం బాధాకరమన్నారు. అందుకే అంతరాలను తగ్గించే ఎందుకి మీ వంతు చేయూత ఇవ్వాలన్నారు. అభివృద్ధి వీకేంద్రీకరణ జరగాలి, అప్పుడే అందరికీ సమాన అవకాశాలు అందుతాయన్నారు. అప్పుడు సమాజంలో పోరాటాలు ఉండవని తెలిపారు. పాలన, అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలంటే మా లక్ష్యం అని తెలిపారు. అభివృద్ధి వికేంద్రీకరణ జరగకపోతే వివక్షతా భావం ప్రజల్లో పెరుగుతోందన్నారు. అందుకే అభివృద్ధి వికేంద్రీకరణ కోసం సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. మీకేంద్రీకరణ జరిగితేనే సమానత్వం సాధ్యపడుతుందన్నారు. అచ్చంపేట, ఆదిలాబాద్,ములుగు, భద్రాచలం వంటి అటవీ ప్రాంతాల్లో విద్యా వ్యాప్తికి మీరు ముందుకు రావడం ప్రపంచానికి ఆదర్శం అని తెలిపారు. దేశమా అధిక రంగంలో దూసుకుపోతున్నా నిలువ నీడలేని ప్రజలు ఎంతోమంది ఉన్నారన్నారు. వారికి అండగా మీరు నిలిస్తే ప్రపంచమే హర్షిస్తుందని తెలిపారు. డిజిటల్ విద్యలో ప్రభుత్వ ప్రయత్నములో మీరు భాగస్వాములు కావాలని కోరారు.

## సుప్రీం కోర్టును ఆశ్రయించిన గ్రూప్ 1 అభ్యర్థులు..



న్యూఢిల్లీ: గ్రూప్-1 పరీక్షలను వాయిదా వేయాలంటూ అభ్యర్థులు (గ్రూప్-1 ఆశావాదులు) సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తమ పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలంటూ చీఫ్ జస్టిస్ కోర్టులో స్పెషల్ మోషన్ దాఖలు చేశారు. అభ్యర్థులకు అడ్వకేట్ మోహిత్‌రావు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పరీక్షల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను ఫాలో కాలేదన అందులో పేర్కొన్నారు. అయితే కేసు సోమవారం జరుపుతామని సీజేఐ విచారణ చంద్రచూడ్ ఏర్పాటు. మొదటి కేసుగా ఉదయం 10.30 గంటలకు విచారించనున్నారు. కాగా, అదే రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు గ్రూప్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి.మరోవైపు గ్రూప్-1 పరీక్షలపై సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు డివిజన్ ??విచారణకు స్వీకరించింది. అభ్యర్థుల అప్పీళ్లను ద్విసభ్య ధర్మాసనం మరో బెంచ్‌కు పాస్ఓవర్ చేసింది. తప్పుడు సమాధానాలతో కూడిన తుది కీ ఆధారంగా నిర్వహించే గ్రూప్-1మెయిన్స్ పరీక్ష ప్రభావం ఎంపికపై ఉంటుందంటూ ఇతర గ్రూప్-1 అభ్యర్థులు హైకోర్టులో అప్పీళ్లను దాఖలు చేశారు. సింగిల్ జడ్జి ఈ నెల 15న ఇచ్చిన తీర్పును రద్దు చేయాల్సిన అవసరం ఉంది. గ్రూప్-1 ప్రిలిమినరీ కీలో తప్పులున్నాయని పలు ఆధారాలను సమర్పించిన సింగిల్ జడ్జి పట్టించుకోలేదని తెలిపారు. ఈ అప్పీళ్లపై హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభినంద్కుమార్ షావిలి ఆమోదాన్ని ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం చేపట్టే అవకాశం ఉంది. 'కేసులోని పూర్వాపరాలను, వాస్తవాలను సింగిల్ జడ్జి కోసం తీసుకోలేదు. టీజీపీఎస్సీ ప్రకటించిన తుది కీలో తప్పులున్నాయని ఆధారాలు చూపినా వాటి జోలికి వెళ్లలేదు. దరఖాస్తు మా వాదనలను తీసుకోలేదు. ప్రశ్నల్లో ఏ రకంగా తప్పులున్నాయో చెప్పినా పరిశీలించలేదు. ప్రశ్నకు ఐచ్ఛిక సమాధానాల్లో సరైనది లేనప్పుడు ఆ ప్రశ్నను తప్పుగా పరిగణించాలి. కానీ ఆ విధంగా జరగలేదు.మెలికలతో కూడిన ప్రశ్నలు ఉండాలంటూ సర్వీస్ కమిషన్ చేసిన వాదనను సింగిల్ జడ్జి ఆమోదించడం చట్ట వ్యతిరేకమని ప్రకటించాలి. 41, 119వ ప్రశ్నలను తెలుసుకోవడం.. తమకు అనుకూలంగా ఆదేశాలు వచ్చేవి. ఈ రెండు ప్రశ్నలను తొలగించడం వల్ల మెరిట్ జాబితాపై ప్రభావం పడుతుంది. ఇలాంటి కీ ద్వారా మెయిన్స్‌కు అభ్యర్థుల జాబితా రూపొందించడం చట్ట వ్యతిరేకం. ప్రాథమిక పరీక్ష ఒకటే ఎంపికకు ప్రామాణికం కాబోదు. ఇది కేవలం అర్హత పరీక్ష మాత్రమేనని సింగిల్ జడ్జి పేరొనడం చెల్లదు. సింగిల్ జడ్జి తీర్పును రద్దు చేయాల్సిందే' అని పిటిషనర్లు తమ అప్పీళ్లల్లో నిర్ణయించారు.

## సీఎంతో జాగ్రత్త.. నేతలతో కేసీఆర్ మంతనాలు..!



హైదరాబాద్, మూసీపై రాజకీయాలు హీటెక్కాయా? సీఎం రేవంత్‌రెడ్డి సూచనలపై బీఆర్ఎస్ నేతలు ఏమంటున్నారు? మూసీపై అసెంబ్లీలో చర్చకు కారు పార్టీ నేతలు సిద్ధమవుతారా?ఈ వ్యవహారంలో అధికార పార్టీకి బీఆర్ఎస్ చిక్కినట్టేనా? రాత్రి కేసీఆర్‌తో చర్చల వెనుక ఏం జరిగింది? ఎందుకు బీఆర్ఎస్ నేతలు ఉలిక్కిపడుతున్నారు? ఇవే ప్రశ్నలు తెలంగాణ ప్రజలను వెంటాడు తున్నాయి.తెలంగాణలో మూసీ పునరుజ్జీవంపై రాజకీయాలు హీటెక్కాయి. అధికార కాంగ్రెస్-విపక్ష బీఆర్ఎస్ ఎవరికి వారే ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. కారు పార్టీ నేతల వ్యాఖ్యలపై ఫుల్ క్లారిటీ ఇచ్చారు సీఎం రేవంత్‌రెడ్డి. ముఖ్యమంత్రి చేసిన సూచనలు స్వీకరించకుంటే ప్రజల ముందు దోషిగా నిలబడాల్సి వస్తుంది కారు పార్టీ. మూసీ వ్యవహారం తమను ముంచడం ఖాయమనే చర్చ ఆ పార్టీ నేతల్లో అంతర్గతంగా మొదలైపోయింది.గురువారం సాయంత్రం మీడియా ముందుకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి, మూసీ పునరుజ్జీవనపై వివరణ ఇచ్చారు. దాని గురించి డీటేల్‌గా చెప్పారు. ఈ క్రమంలో బీఆర్ఎస్‌కు మూడు సలహాలు ఇచ్చారు. మూసీ పునరుజ్జీవనపై ఏం చేయాల్లో అసెంబ్లీలో సలహాలు ఇవ్వాలన్నది మొదటిది. దీనిపై డీటేల్‌గా సభలో చర్చిద్దామన్నారు.మూసీ పునరుజ్జీవం అడ్డుకున్న నేతలకు మరో సలహా ఇచ్చారు సీఎం రేవంత్‌రెడ్డి. అడ్డుకుంటున్న ముగ్గురు నేతలు కేటీఆర్, హరీష్‌రావు, ఎంపీ ఈటల రాజేందర్ మూడునెలలపాటు ఆయా ప్రాంతాల్లో ఉండాలంటూ మెలిక పెట్టారు. ఆ ప్రాంతంలో మీరుంటే ప్రక్షాళన కార్యక్రమాన్ని నిలిపివేస్తామని చెప్పకనే చెప్పేశారు.మూడోది ప్రాజెక్టులపై మీరు ఎక్కడికి రమన్నా వస్తానని తేల్చి చెప్పేశారు సీఎం రేవంత్‌రెడ్డి. ఆ అవకాశాన్ని కూడా విపక్ష నేతలకు వదిలేశారు. డేట్, టైమ్, ప్లేస్.. ఎక్కడైనా, ఎప్పుడైనా సెక్యూరిటీ లేకుండా రావటానికి తాను సిద్ధమేనని కుండబద్దలు కొట్టేశారు.ఈ వ్యవహారాన్ని కేసీఆర్ క్షుణ్ణంగా గమనిస్తున్నారు. గతరాత్రి కేటీఆర్, హరీష్‌రావులను తన ఇంటికి అధినేత పిలిచినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో ముగ్గురు మధ్య చిన్నపాటి చర్చ జరిగిందట. ముఖ్యమంత్రి మాటలపై మీడియా ముందు జాగ్రత్త మాట్లాడాలని సలహా ఇచ్చారు పెద్దాయన. మనం ఏం మాట్లాడినా మన మెడకు చుట్టుకునే విధంగా ఉండకూడదన్నది దాని సారాంశం.కేసీఆర్‌తో సమావేశం తర్వాత ఆ ఇద్దరు నేతలు.. ఆ పార్టీ ఎమ్మెల్యేలతో మాట్లాడారట. మూసీపై ఎలా ముందుకు వెళ్లాలని చర్చించుకున్నారట. దీనిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తే బెటరని సూచన చేసినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలతో కారు నేతలు ఒకింత టెన్షన్ పడినట్టే కనిపిస్తోందని అంటున్నారు.

## ఈషా ఫౌండేషన్‌కు భారీ ఊరట..



న్యూఢిల్లీ,ఆధ్యాత్మిక గురువు సద్గురు జగ్గీ వాసుదేవ్‌కు భారీ ఊరట లభించింది. సద్గురుకు చెందిన ఈషా ఫౌండేషన్ పై నమోదైన కేసును సుప్రీంకోర్టు కొట్టేసింది. తన ఇద్దరు కూతుళ్లను సద్గురు బ్రెయిన్‌వాష్ చేశారని, వాళ్లను ఈషా యోగా సెంటర్ నుంచి బయటకు రానివ్వడం లేదంటూ ఓ వ్యక్తి ఇటీవలే హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై దేశ అత్యున్నత న్యాయస్థానం ఇవాళ విచారణ జరిపింది.విచారణ సందర్భంగా ఆ ఇద్దరు మహిళలు ఈషా కేంద్రంలో స్వచ్ఛందంగానే ఉంటున్నారని అత్యున్నత న్యాయస్థానానికి పోలీసులు తెలిపారు. ఈ మేరకు వివరాలు సమర్పించారు. పోలీసులు సమర్పించిన వివరాలను పరిశీలించిన న్యాయస్థానం.. ఈ కేసును కొట్టేస్తూ ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు వెలువరించింది.కోయంబత్తూరులోని తమిళనాడు అగ్రికల్చర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్ కామరాజ్ ఆ కేసు ఫైల్ చేశారు. 42, 39 ఏళ్లు ఉన్న ఇద్దరు కూతుర్లను సద్గురు బ్రెయిన్‌వాష్ చేశారని, వాళ్లను ఈషా యోగా సెంటర్ నుంచి బయటకు రానివ్వడం లేదంటూ ఆరోపించారు. ఈ మేరకు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇటీవలే ఈ కేసుపై మద్రాసు హైకోర్టులో విచారణ జరిగింది. ఈ విచారణ సందర్భంగా ఇద్దరు మహిళలు కోర్టుకు హాజరయ్యారు. తమ ఇష్ట ప్రకారమే ఈషా ఫౌండేషన్‌లో ఉంటున్నట్లు చెప్పారు. తమను ఎవరూ బంధించలేదని స్పష్టం చేశారు.దీంతో ఈషా ఫౌండేషన్‌కు సంబంధించిన అన్ని కేసుల జాబితాను తయారు చేసి, నివేదికను సమర్పించాలని పోలీసులను కోర్టు ఆదేశించింది. ఫౌండేషన్‌పై అనేక క్రిమినల్ ఫిర్యాదులు ఉన్నాయని పేర్కొన్న మద్రాస్ హైకోర్టు.. ఈ కేసులో మరింత లోతుగా విచారణ చేపట్టాలని సూచించారు. సద్గురు తన కుమార్తెకు వివాహం జరిపించి సంపన్నమైన జీవితాన్ని ప్రసాదించారని, ఇతర స్త్రీలను సన్యాసం తీసుకునేలా ప్రోత్సహిస్తున్నాడని కోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఈ మేరకు హైకోర్టు ఈషా ఫౌండేషన్‌కు వ్యతిరేకంగా ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాల మేరకు దాదాపు 150 మంది పోలీసులు ఈషా ఫౌండేషన్‌లో తనిఖీలు చేశారు.ఇక ఈ వ్యవహారంపై ఈషా ఫౌండేషన్ సుప్రీంకోర్టులో సవాలు చేసింది. దీంతో ఈ కేసు మద్రాసు హైకోర్టు నుంచి సుప్రీం కోర్టుకు బదిలీ అయ్యింది. దీనిపై ఇటీవలే విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం.. మహిళల వాంగ్మూలాన్ని బట్టి వారు స్వచ్ఛందంగా ఆశ్రమంలో ఉండటంపై ఎలాంటి సందేహాలకు తావులేదని పేర్కొంది. ఈ కేసులో తదుపరి చర్యలు తీసుకోకుండా స్టేటస్ రిపోర్టును అత్యున్నత న్యాయస్థానంలో దాఖలు చేయాలని తమిళనాడు పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు ఇవాళ తీర్పు వెలువరించింది.

### 20న వారణాసిలో ప్రధాని పర్యటన

వారణాసి,భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అక్టోబర్ 20న తన సొంత పార్లమెంటరీ నియోజకవర్గమైన వారణాసిలో పర్యటించనున్నారు. సుమారు ఆరు గంటలపాటు కాశీలోనే బస చేయనున్నారు. ఉత్తరాదిన పెద్ద పండుగగా జరుపుకునే దీపావళి పర్వదినానికి కొద్ది రోజుల ముందే వారణాసితో సహా దేశవ్యాప్తంగా రూ. 3,254.03 కోట్ల విలువైన ప్రాజెక్టలను చేపట్టనున్నారు. రూ.380.13 కోట్లతో 15 ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం, రూ.2,874.17 కోట్లతో రెండు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. వారణాసి పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ సిగ్రా స్పోర్ట్స్ స్టేడియంలో బహిరంగ సభలో కూడా ప్రసంగిస్తారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వారణాసి నుంచే దేశంలోని 6 విమానాశ్రయాలను అభివృద్ధి చేసే ప్రాజెక్టులను ప్రారంభిస్తారు.

## సంపాదకీయం

శనివారం 19-10-2024

# ఉచిత ఇసుక ఎందుకు అమలు కావడంలేదు?

వంద రోజుల క్రితం జరిగిన రాష్ట్ర శాసనసభ ఎన్నికలను బాగా ప్రభావితం చేసిన ప్రజా సమస్య ఇసుక సమస్య. తెలుగుదేశం కూటమి అధికారంలోకి రావడంలో ఉచిత ఇసుక హామీ కూడా కీలకమైంది. కొత్త ప్రభుత్వం ఏర్పడింది. అయినా ఇసుక సమస్య తీరలేదు. ఈ వంద రోజుల్లో స్వయంగా ముఖ్యమంత్రి మూడు సార్లు ఈ సమస్యపై సమీక్షించినా పరిస్థితుల్లో పెద్ద మార్పు లేదు. ఇసుక అందరికీ దొరకడంలేదని అందుకు కారణం వర్షాలు, వరదలని గత కొన్ని రోజుల క్రితం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. వర్షాలు, వరదలు వచ్చిన ప్రాంతాల్లోనే కాదు అవి అంతగా లేని ప్రాంతాల్లో కూడా ఈ సమస్య ఎందుకు వుందో ఆయన చెప్పలేదు. ప్రకృతి సహజ వనరులను వ్యాపార సరుకుగా మార్చిన ప్రపంచీకరణ విధానాల్లో ఈ సమస్య మూలముంది. సహజంగా దొరకాల్సిన ఇసుకను గత, ప్రస్తుత పాలక పార్టీలు వ్యాపార సరుకుగా మార్చి, కృత్రిమ కొరతను సృష్టించి, ఇతర రాష్ట్రాలకు తరలించి అక్రమంగా సొమ్ము చేసుకునే వనరుగా మార్చడంతో ఈ సమస్య కొనసాగుతున్నది. ఉచిత ఇసుక పేరు చెప్పి గతం కంటే రెట్టింపు ధర చేశారు. ఉచిత ఇసుక అంటూనే ప్రైవేటు వారికి, అధికారంలో ఉన్న వారి అనుయాయులకు రీచ్‌లు అప్ప గిస్తున్నారు. ఇది ఒక రకంగా మాఫియా. పాత ఎంఎల్‌ఏ పోయి కొత్త ఎంఎల్‌ఏ వచ్చారు. పాత ముఖం స్థానంలో కొత్త ముఖం. అంతే. ఉచిత ఇసుకకు జి.ఎస్.టి పేరుతో టెండర్లు పిలవడం ఏమిటి? ఆ విధానాలు మార్చకుండా ఇసుక సమస్య తీరుస్తామని చెప్పడం అతి పెద్ద అబద్ధం అవుతుంది. 2014లో తెలుగుదేశం అధికారంలో వున్నప్పుడు ఉచిత ఇసుక విధానాన్ని తీసుకువచ్చారు. 'మన మహిళా సంఘాలే ఇసుకు అందిస్తాయి. దళారీ వ్యవస్థ వుండదు' అని ముఖ్యమంత్రిగా నాడు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే చంద్రబాబు ప్రకటించారు. డ్వాక్రా మహిళల ద్వారా ఈ విధానం అమలవుతుందని మెమో నెంబర్: 3066 (4.3.2016) విడుదల చేశారు. ఈ మెమో ప్రకారం 500 మీటర్ల సమీపం నుండి ఎడ్లబండ్లపై ఇసుకను తెచ్చుకునే వారికి ఈ ఉచిత ఇసుక విధానం అమలవుతుందని సన్నాయి నొక్కులు నొక్కడం ప్రారంభించారు. క్రమంగా ఉచిత ఇసుక విధానాన్ని మారుస్తూ వచ్చారు. ఈ ఒక్క విధానంపై అనాటి చంద్రబాబు ప్రభుత్వం 19 జీవోలను విడుదల చేసిందంటే అశ్చర్యపోతాము. ఉచిత ఇసుక విధానం డ్వాక్రా మహిళలను లక్షధికారులను చేయడమో, ఇసుక వాడకందార్లకు ఉపయోగపడడమో కాదు. పాలక పార్టీ నేతలకు ప్రధాన ఆదాయ వనరుగా మారింది. ప్రభుత్వం ప్రకటించిన రీచ్‌లలో కాకుండా ఇతర చోట్ల అక్రమంగా తవ్వకాలు జరపడం మొదలైంది. కొరత సృష్టించి బ్లాక్‌లో అమ్మడం మొదలైంది. పొరుగున వున్న ఇతర రాష్ట్రాలకు పెద్ద ఎత్తున తరలించే వ్యాపార వనరుగా మారింది. ఈ వ్యవహారంపై నాడు జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్.జి.టి) తీవ్రంగా స్పందించి ప్రభుత్వంపై రూ.100 కోట్ల జరిమానా విధించింది. ప్రభుత్వ విధానాన్ని అమలు చేయడానికి ప్రయత్నించిన ఎమ్మార్వో వనజాక్షిపై నాటి తెలుగుదేశం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చేసిన దాడి ఉచిత ఇసుక విధానం యొక్క డొల్లతనాన్ని, అక్రమ వ్యాపార తీవ్రతను బట్టబయలు చేసింది. జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుక టెండర్ల విధానాన్ని అమలు చేసింది. టెండర్ల ద్వారా కాంట్రాక్టు దక్కించుకున్న కంపెనీలు ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఇసుకను అమ్మాలని జీవో ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎం.ఎస్.టి.సి ద్వారా గనుల శాఖ టెండర్లు నిర్వహించింది. ప్రతిమా ఇన్‌ఫ్రా లిమిటెడ్ 18 జిల్లాల్లో, జి.సి.కె.సి ప్రాజెక్టు-వర్కర్స్ ప్రైవేట్ లిమిటెడ్ 8 జిల్లాల్లో ఇసుక తవ్వకాలు చేయడానికి ఈ టెండర్లను దక్కించు కున్నాయి. వైసిపి ప్రభుత్వం 16.4.2021న జీవో నెంబర్ 21 విడుదల చేసింది. ఈ జీవోకు అనుగుణంగా జె.పి (జయప్రకాష్ పవర్) వెంచర్స్ రంగప్రవేశం చేసింది. అంతకు పూర్వం మైనింగ్ వ్యవహారాల్లో ఈ సంస్థకు ఎలాంటి అనుభవం లేదు. ఈ కంపెనీ 'మఘలో పుట్టి పుబ్బలో పోయే' అధికార పార్టీ నేతల బినామీ కంపెనీ అని ఆనాడే పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. టన్నుకు రూ.375గా ప్రభుత్వం నిర్ణయించింది. నిర్వహణ చార్జీల కింద మరో రూ.100 వసూళ్లు చేసుకోవచ్చని సవరణ చేసింది. ఈ విధానం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతి సంవత్సరం రూ.780 నుండి రూ.760 కోట్లు, ఐదేళ్లలో రూ.4 వేల కోట్ల నుండి రూ.3,825 కోట్లు ఆదాయం వస్తుందని లెక్కలేసి మరీ చెప్పారు. 2019 నుండి మూడు సార్లు ఇసుక విధానాన్ని సవరించారు. 110 ఇసుక ర్యాంపుల ద్వారా సుమారు 77 లక్షల టన్నులు, డీ సిల్టింగ్ పాయింట్స్ అంటూ మరో 42 కేంద్రాల ద్వారా 90 లక్షల టన్నుల ఇసుక తవ్వేందుకు ప్రభుత్వం అనుమతులిచ్చింది. ఇసుక వాడకందార్లు నాణ్యమైన ఇసుకను ఏ ర్యాంప్ నుండైనా తెచ్చుకోవచ్చు అని విధానాన్ని మార్చారు. దీన్ని అవకాశంగా తీసుకుని ఎక్కడి నుంచి ఎక్కడికైనా తరలించడం మొదలు పెట్టారు. ఇసుక కొరత ఏర్పడింది. టన్ను రూ.375 కాస్తా 600 నుండి వెయ్యి రూపాయలకు పెరిగింది. అనేక ప్రాంతాల్లో బ్లాక్‌లో ట్రాక్టరుకు పది వేలు పెట్టి కొనాల్సి వచ్చింది. టెండర్లు దక్కించుకున్న సంస్థలే కాకుండా అనేక బినామీ కంపెనీలు యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు చేశాయి. నదుల మధ్యలో పెద్ద యంత్రాలతో తవ్వకాలు చేయరాదనే నిబంధనలు తుంగలో తొక్కబడ్డాయి. అక్రమంగా ఇసుక తవ్వకాలు, తరలింపులు పెద్ద ఎత్తున పెరిగాయని, అనుమతులు లేకుండా జరుగుతున్న తవ్వకాలను నిలిపివేయాలని ఎన్.జి.టి ఉత్తర్వులు ఇచ్చింది. 2014-19 నాటి టిడిపి ప్రభుత్వానికి ఎన్.జి.టి వేసిన వంద కోట్ల అపరాధ రుసుము గురించి ప్రచారం చేసుకున్న వైసిపి తమ పాలనలో జరుగుతున్న అక్రమాల గురించి అదే సంస్థ ఇచ్చిన ఆదేశాలను బేఖాతరు చేసింది. మన రాష్ట్రంలో అక్రమ ఇసుక తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని ఈ సంవత్సరం మే నెలలో సుప్రీంకోర్టు ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయినా విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు, అక్రమ తరలింపు కొనసాగించింది. 2023 ఆగస్టు నాటికి 6.7 కోట్ల టన్నుల ఇసుక తవ్వకాలు జరిపినట్లు, దీని ద్వారా ప్రభుత్వానికి రూ. 2,300 కోట్లు ఆదాయం వచ్చినట్లు జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రకటించింది. అక్రమ తవ్వకాలు, అనేక సబ్ కాంట్రాక్టు సంస్థల ద్వారా, మధ్యవర్తుల ద్వారా ఇష్టమొచ్చినట్లు రశీదులు ఇస్తున్న విషయంపై నాటి గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పందిస్తూ ఎవరు తవ్వారు, ఎవరు రశీదు ఇచ్చారనేది మాకు ముఖ్యం కాదు. ప్రభుత్వానికి ఆదాయం వచ్చిందా లేదా అనేదే మాకు ముఖ్యమన్నారు. మరి ఐదేళ్ళకు రూ.నాలుగు వేల కోట్లు ఆదాయం వస్తుందన్నారు కదా. రూ.2,300 కోట్లే ఎందుకు వచ్చిందో? మిగిలిన సొమ్ము ఎవరి జేబుల్లోకి పోయిందో ఆయన చెప్పలేదు. అప్పటి గనులశాఖ డైరెక్టర్ వి.జి.వెంకటరెడ్డి ఇసుక అక్రమాలపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్.ఇ.బి) అధికారులు 18 వేల కేసులు నమోదు

# 'కోట్ల' ఉచితాలతో ఓట్లు రాలుతాయా?



ముంబై:'ఎన్నికల్లో ఉచిత హామీలు ప్రభుత్వ ఖజానాపై మితిమీరిన ఆర్థిక భారంపడేలా చేస్తాయి. ఓట్లు పొందిన తరువాత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి ఎలాంటి యంత్రాంగమూ ఉండదు. ఉచిత వాగ్దానాలు రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నాయి. రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించే ప్రజాకర్షక చర్యలపై పూర్తిగా నిషేధం విధించాల్సిన అవసరం ఉంది' ఇది సుప్రీం కోర్టు ఉచిత హామీలపై పిటిషన్లు దాఖలైన సందర్భంగా వెలిబుచ్చిన అభిప్రాయం. ఈ ఉచిత హామీల సంస్కృతి ఇప్పటివరకు ప్రతి పార్టీ, ప్రతి ప్రభుత్వం ఎన్నికల్లో పాటించడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర ప్రభుత్వం కూడా ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గత నాలుగు నెలల్లో 150 ఉచిత హామీలను అత్యంత వేగంగా ప్రకటించడమే కాదు కొన్నిటిని ఆచరణలోకి తీసుకొచ్చింది. నవంబర్ 20న జరగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ఉచిత హామీలు తమకు గెలుపునకు మెట్లు కాగలవని మహాయుతి ప్రభుత్వం ఆశిస్తోంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి మాఝీ లడ్కీ బహిన్ యోజన అనే పథకం తప్పనిసరిగా గెలిపిస్తుందన్న అపార విశ్వాసంతో మహాయుతి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ పథకాన్ని మధ్యప్రదేశ్‌లో శివరాజ్ సింగ్ చౌహాన్ మొదట అమలు చేయగా, అదే పథకాన్ని ఇప్పుడు మహారాష్ట్రలో అమలులోకి తీసుకొచ్చారు. ఈ పథకం కింద మహిళా లబ్ధిదారులకు నెలకు రూ.1500 వంతున చెల్లిస్తామని హామీ గుప్పించారు. ఈ పథకం అమలులోకి తేవడం కోసమే హర్యానా, కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలతోపాటు మహారాష్ట్ర ఎన్నికలను నిర్వహించకుండా వాయిదా వేశారని విపక్షాలు ఆరోపిస్తున్నదాంటో కొంత నిజం లేకపోలేదు. నవంబర్ 20న మహారాష్ట్రలో మహిళలు ఓటు వేసే ముందు కనీసం మూడు నాలుగు వాయిదాల నగదైనా ఈ పథకం కింద వారి అకౌంట్లలో జమ కావాలన్నదే షిండే ప్రభుత్వ ఎత్తుగడ. లోక్‌సభ ఎన్నికల్లో మహాయుతి ప్రభుత్వం ఊహించలేని షాక్ తిన్న తరువాత రెండు నెలలకు ఆగస్టు 15న షిండే సంకీర్ణ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రకటించింది. తక్షణమే లబ్ధిదారులైన మహిళల పేర్లు నమోదు చేసి వారి అకౌంట్లలో నగదు చేరేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పటి వరకు 19 మిలియన్ మంది మహిళలు రెండు మూడు వాయిదాల సొమ్ము అందుకున్నారు. మరో ఐదు మిలియన్ల మంది మహిళలు తమ దరఖాస్తుల ఆమోదం కోసం నిరీక్షిస్తున్నారు. అవి ఖరారైతే వారికి కూడా ఆగస్టు నుంచి రావలసిన వాయిదాలతో పాటు పూర్తి మొత్తం అకౌంట్లలో జమ అవుతుంది. ఈ స్కీమ్ వల్ల మహారాష్ట్ర ఖజానాకు దాదాపు రూ. 46,000 కోట్లు లోటు ఏర్పడుతుంది. ఇన్ని వేల కోట్లు భరించవలసి రావడం స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తిలో 10% వరకు, 2024 మొత్తం రెవెన్యూలో 9% వరకు వెచ్చించక తప్పడం లేదు. దీనికి తోడు వృద్ధ మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, పేద మహిళలకు ఉచితంగా వంట పాత్రలు, చీరెలు, నిర్మాణ రంగ కార్మికులకు పనిముట్లు, మదర్సా టీచర్లకు వేతనాల పెంపు, రాజకీయ నేతలు నడిపే లేదా స్వయంగా నడిచే ట్రస్టులకు ఉచితంగా స్థలాలు, ఇవన్నీ షిండే ప్రభుత్వం ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ప్రకటించింది. ఈ మొత్తం హామీలన్నీ కలిపి మహారాష్ట్ర ఖజానాకు లోటు రూ. 2 లక్షల కోట్ల వరకు పెరిగింది. దీని వల్ల రాష్ట్ర ఖజానాపై ఎంత భారం పడుతుందో, అలాగే పాలనా యంత్రాంగంపై ఎంత ఒత్తిడి పడుతుందో పట్టించుకోకుండా ఈ హామీలను ఇవ్వడం ఎంతవరకు అధికార కూటమికి లాభం కలిగిస్తుందో చెప్పలేం. ఇవన్నీ బడ్జెట్‌లో చోటు చేసుకోనప్పటికీ ఎన్ని హామీలు కార్యాచరణలోకి వస్తాయో చెప్పలేం. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో గతంలో పంటలు దెబ్బతిన్న రైతులకు చెల్లించవలసిన నష్ట పరిహారాలు చాలా వరకు పెండింగ్‌లో ఉన్నాయి. అవన్నీ ఇప్పుడు హడావిడిగా రైతుల అకౌంట్లలో జమ అవుతున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, ఎన్‌సిపి (శరద్‌పవార్), శివసేన (యుబిటి)లతో కూడిన మహాఅఘాడీ కూటమి 45% ఓట్లను సాధించుకుంది. అంటే మహాయుతి ప్రభుత్వం కన్నా 2 శాతం పాయింట్లు ఎక్కువగా సాధించుకోగలిగింది. పార్లమెంటరీ సీట్ల విషయంలో చూస్తే మహాఅఘాడీ 31 సీట్లు సాధించుకోగా, మహాయుతి కేవలం 17 సీట్లనే దక్కించుకోగలిగింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఓట్ల తేడా బాగా కనిపిస్తోంది. ఈ తేడాను భర్తీ చేసుకోడానికి మహాయుతి ప్రభుత్వం అనేక పథకాలతో ఎత్తుగడలు పన్నుతోంది. రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తి వ్యయాలు విపరీతంగా పెరగడం, దానికి తగ్గట్టు పంటల గిట్టుబాటు ధరలు పెరగక రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. దీనికి తోడు మరాఠా రిజర్వేషన్ ఆందోళనలు, అటవీ హక్కుల మార్పుపై గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ఇవన్నీ ఈసారి అసెంబ్లీ ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి.

# కొత్త పరిశ్రమలు రావలసిందే ఉద్యోగాలు కావాల్సిందే .. కానీ!



హైదరాబాద్,రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కొత్త ప్రభుత్వం వచ్చింది కాబట్టి నిరుద్యోగుల్లో ఆశ పెరిగింది. కొత్తగా పరిశ్రమలు వస్తాయి. తమకు ఉద్యోగాలు వస్తాయని ఎదురు చూస్తున్నారు. టిడిపి ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి విషయంలో గత ప్రభుత్వంతో పోల్చినపుడు కొంత మెరుగు కావచ్చు. కానీ కూటమి ప్రభుత్వం ఇచ్చే నినాదాలు బెరుకు కలిగిస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పి.పి.పి) కాదు, ప్రభుత్వ, ప్రైవేట్, ప్రజల భాగస్వామ్యం (పి.పి.పి.పి) అన్నారు. మూడు 'పి'లు పోయి నాలుగు 'పి' లు వచ్చాయి. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' (వ్యాపారం తేలికగా చేసుకోవటం) ఎపుడో వచ్చింది. దీనికి అదనంగా రాష్ట్రంలో ఇపుడు 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' వచ్చింది. అనుభవాలను మరిచిపోలేరు. కష్టాలు పడ్డ వారి కథలు కో కొల్లలు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం అన్నారు. ప్రభుత్వ (ప్రజల) ఖజానాలో కొంత ప్రైవేటుకు ఇచ్చి ప్రభుత్వ రంగ బ్యాంకుల చేత రుణాలు ఇప్పించిన తరువాత ప్రైవేట్ కంపెనీలు వేసే రోడ్లు, విమానాశ్రయాలు, చేసే విద్యుత్తు ఉత్పత్తి తదితర మౌలిక సౌకర్యాలు ఎవరికి అందుబాటులో ఉన్నాయి? ఎవరి మీద భారాలు పడుతున్నాయి? ఒక పక్కన దసరా, సంక్రాంతి పండుగల సందర్భాల్లో 4 లైన్లు, 6 లైన్లు హైవేల్లో టోలుగేట్లు దగ్గర బారులు తీరే కార్లు. మరోపక్క రైళ్లలో జనరల్ కంపార్ట్‌మెంట్లు, స్లీపర్‌కోచ్‌లు తగ్గిపోయి, బస్టాండ్లలో తగినన్ని బస్సులు లేక కిటకిటలాడిపోయే జనం. ప్రైవేట్ కంపెనీల చేతివాటంతో పెరిగిపోతున్న 'ట్రూ అప్' విద్యుత్తు భారాలు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం అసలు రూపం ఇదే. ఇపుడు కొత్తగా ప్రజల భాగస్వామ్యాన్ని కూడా చేర్చారు. ఇంతకు ముందు లేనిది ఇపుడు కొత్తగా వస్తోందా? మునుపటి కంటే ప్రజల భాగస్వామ్యం మరింత పెరిగిపోతుందా? కొత్తగా ప్రజలకు అనుకూల మార్పు వస్తోందా? ఎస్.ఇ.జెడ్ లలో వచ్చిన కంపెనీలకు భూములు ఇచ్చి రైతులు ఆ కంపెనీల్లో కూలీలుగా మారారు. పరిశ్రమల నిర్మాణ సమయంలో వచ్చే, పోయే లారీల్లో దింపుడు, ఎత్తుడు హమాలీలయ్యారు. కోల్‌కొతా-చెన్నరు రహదారి పక్కన తమిళనాడు సరిహద్దులో ఉన్న పేరు మోసిన ఎస్.ఇ.జెడ్.లో భూములు కోల్పోయిన రైతులు గతిలేక ఎస్.ఇ.జెడ్ భూముల్లోకి గొడ్లు రాకుండా చూసుకునే కూలీలుగా మారడానికి కూడా సిద్ధపడుతున్నారు. ఇపుడు కొత్తగా అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఎస్.ఇ.జెడ్ లో ఉన్న ఒక కంపెనీలో భూములు ఇచ్చిన రైతు కుటుంబాలకు చెందిన 70 శాతం మంది కార్మికులుగా చేరారు. కానీ వారిని 12 సంవత్సరాల తర్వాత కూడా కంపెనీ కార్మికులుగా కూడా గుర్తించలేదు. నైపుణ్యాన్ని బట్టి వేతనాలు ఇవ్వలేదు. కంపెనీ చేసిన ఆర్థిక తప్పిదానికి ప్రస్తుతం మూతపడింది. భూములు ఇచ్చిన కార్మికుల రెక్కలు ముక్కలయ్యాయి. కొత్తగా వచ్చే నాలుగో 'పి' అంటే ప్రజల భాగస్వామ్యం ఏ విధంగా అదే ప్రజలకు ఇంత కంటే మెరుగ్గా ఒరగబెడుతుందో కూటమి ప్రభుత్వం చెప్పాలి. లేదంటే ఏ నినాదం వెనుక ఏ వర్గ ప్రయోజనం దాగి ఉందోనని ప్రజలు తెలుసుకోటానికి పెద్ద సమయం పట్టదు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ (తేలికగా వ్యాపారం చేసుకోవటం) పేరుతో పెట్టుబడిదారులకు ఉన్న ఆటంకాలను తొలగించారు. ప్రభుత్వాలు ఏకపక్షంగా పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే పని చేస్తున్నాయి. యూనియన్లు పెట్టుకోనివ్వటం లేదు. అలా ముందుకు వచ్చిన వారిని ఉద్యోగాల నుండి తొలగిస్తున్నారు. ప్రైవేట్ పరిశ్రమల్లో గుర్తింపు ఎన్నికలు మూలపడ్డాయి. తనిఖీలను ఎత్తివేశారు. కార్మికుల భద్రతను గాలికొదిలేశారు. కనీస వేతన చట్టం ప్రకారం 5 సంవత్సరాలకు ఒకసారి కార్మికులు వేతనాలు పెంచాలి. 2005-06 సంవత్సరాల తర్వాత పరిశ్రమలతో సహా షెడ్యూల్డు ఎంప్లాయిమెంట్లలో 50 లక్షల మంది కార్మికులకు వేతనాలు పెంచలేదు. ఆ 18 సంవత్సరాల క్రితపు వేతనాలను కూడా నైపుణ్యాలకు తగినట్లుగా ఇవ్వటం లేదు. అదానీ పోర్టులో కూడా ఇదే పరిస్థితి. కార్మికులను కదలకుండా చేయటానికి పోర్టుల్లో, ఎస్.ఇ.జెడ్ లలో పోలీసు స్టేషన్లు వచ్చాయి. యూనియన్లకు ప్రవేశం లేదు. విడివిడిగా ఉండే ప్రైవేట్ పరిశ్రమలన్నింటిలో కూడా ఇదే పరిస్థితి. లేబరు అధికారులు చేతులెత్తేశారు. తమ చేతులు కట్టివేయబడ్డాయని వాపోతున్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పరిస్థితే ఇలా ఉంటే 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' ఇంకెలా ఉంటుందోనని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. తాము మరింతగా తొక్కివేయబడతామని భయ భ్రాంతులకు గురవుతున్నారు. ఏ ప్రభుత్వమైనా ఆ పథకం ఇస్తాం, ఈ పథకం ఇస్తామని మభ్యపెడుతున్నాయి తప్పిస్తే కార్మికులకు వేతనాలు పెంచుతాం, కార్మిక హక్కులను కాపాడతామని చెప్పటం లేదని కార్మికులు గుర్తించాలి. ఒకరు ప్రతిపక్షంలో ఉన్నపుడు ప్రతి ఫ్యాక్టరీలో యూనియన్లు పెట్టమని చెపుతారు. అధికారంలోకి వచ్చిన తర్వాత యూనియన్లు పెట్టి ఆందోళన చేస్తామంటే కుదరదంటారు. మరొకరు ప్రతిపక్షంలో ఉండగా వీధి వీధికి, గడప గడపకు తిరిగి అధికారంలోకి వచ్చాక కలుగులో ఉండిపోయి బయటకు రాలేదు. కార్మికుల సమస్యలను, కోర్కెలను తెలియజేయటానికి యూనియన్లు పెట్టటం తప్పనిసరి. 1926 ట్రేడ్‌యూనియన్ల చట్టం ప్రకారం రిజిస్ట్రార్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ల (లేబర్ కమిషనర్లు) ద్వారా కార్మిక సంఘాలను రిజిస్టర్ చేయటం ప్రభుత్వాల బాధ్యత. తద్వారా విడి విడి కార్మికుల గొంతును వినిపించే అవకాశం కల్పించాలి. రాజ్యాంగంలోని 19(1) (సి) అధికరణం ప్రకారం యూనియన్లు, అసోసియేషన్లను ఏర్పాటు చేసుకోవటం ప్రాథమిక హక్కు. పారిశ్రామిక వివాదాల చట్టం సమ్మె చేయటాన్ని కార్మికుల చట్టపరమైన హక్కుగా గుర్తించింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కింద ఈ హక్కులు కాలరాయబడుతున్నాయి. కార్మికులు సంఘటితం కావాలి. చట్టపర హక్కుల కోసం పోరాడాలి. కార్మిక సంఘాలు కార్మికులను చైతన్యపర్చి కార్మికులను సంఘటితం చేసేందుకు పూనుకోవాలి.

# పకడ్బందీగా గ్రూప్-1 పరీక్షలు

హైదరాబాద్,ఈ నెల 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరిగే గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను ఏవిధమైన పొరపాట్లు లేకుండా అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, సంబంధిత ఉన్నతాధికారులతో సీఎస్ సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. టీజీపీఎస్సీ కార్యాలయం నుంచి చైర్మన్ మహేందర్ రెడ్డి, సభ్యులు, సచివాలయం నుంచి డీజీపీ జితేందర్, కమిషన్ కార్యదర్శి నవీన్ నికోలస్, ఎస్పీడీసీఎల్ ఎండీ ముష్రాఫ్ అలీ, రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కర్ణన్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు అనుదీప్, శశాంక్, గౌతమ్ తదితర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ .. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు 34,383 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. హెచ్ఎండీఏ పరిధిలో 46 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు సీఎస్ శాంతి కుమారి. టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ..

# నాలుగు నెలలైనా అమలుకు నోచని హామీ

విజయవాడ, దసరా పండుగకు చేనేత సొసైటీల్లో వస్త్ర విక్రయాలకు ప్రభుత్వ ప్రోత్సాహం అందిస్తుందని ఆశించిన నేతన్నలకు నిరాశే మిగిలింది. పండుగకు ఇచ్చే రిబేటుపై ప్రభుత్వం ఎటువంటి ప్రకటనా చేయలేదు. దీంతో సాదాసీదాగానే వస్త్ర వ్యాపారం సాగింది. 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించుకున్న నేతన్నలకు ఉచితంగా విద్యుత్ అందిస్తామని కూటమి నేతలు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. అయితే టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలవుతున్నా ఈ హామీ అమలుకు నోచుకోలేదు. మరోపక్క రిబేటు, యార్న్ సబ్సిడీ పాత బకాయిలను ప్రభుత్వం విడుదల చేయలేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూడా అమలు చేయకపోవడంతో నేతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, రాష్ట్ర విభజన తర్వాత 2014-19 మధ్యకాలంలోనూ చేనేత వస్త్ర ఉత్పత్తుల అమ్మకాలను ప్రభుత్వాలు ప్రోత్సహించాయి. పండుగల రోజుల్లో సొసైటీల్లో వస్త్ర విక్రయాలపై 30 శాతం రిబేటు ప్రకటించాయి. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేత వస్త్ర విక్రయాలకు ప్రభుత్వాలు ఇచ్చే ప్రోత్సాహాలను, సొసైటీలకు విడుదల చేయాల్సిన రాయితీ బకాయిలను నిలిపివేసింది. తాజాగా టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఏడాది జూలై 13న రాష్ట్ర బిసి సంక్షేమం, చేనేత, టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి ఎస్.సవిత కృష్ణాజిల్లా పెడన, గూడూరు మండలాల్లో పర్యటించి ప్రసిద్ధి చెందిన చేనేత సొసైటీలను పరిశీలించారు. నేతన్నలను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ప్రకటించారు. దీంతో గత టిడిపి హయాంలోలాగా సొసైటీల్లో వస్త్ర విక్రయాలపై పండుగలకు ప్రభుత్వం 30 శాతం రిబేటు ప్రకటిస్తుందని, తద్వారా ఈ ఏడాది వస్త్ర వ్యాపారం పెరుగుతుందని ఆశించిన వారికి నిరాశే మిగిలింది. కృష్ణాజిల్లాలోని 37 సొసైటీల్లో ప్రతి ఏటా సగటున రూ.11.99 కోట్ల విలువైన 7,02,633 మీటర్ల చేనేత వస్త్రాల ఉత్పత్తి జరుగుతోంది. వినాయక చవితి, దసరా, దీపావళి, సంక్రాంతి పండుగలకు గతంలో 30 శాతం రిబేటు ప్రకటించారు. ఆయా సందర్భాల్లో సొసైటీల్లో 35 శాతం వరకు చేనేత వస్త్ర విక్రయాలు పెరిగాయి. తాజాగా రిబేటుపై ప్రకటన చేయకపోవడంతో దసరా పండుగకు సాదాసీదాగానే వస్త్ర వ్యాపారం సాగింది. 2016-17 నుంచి 2018-19 వరకు మూడేళ్లలో పండుగలకు ప్రకటించిన 30 శాతం రిబేటు రూ. 6.11 కోట్లు, యార్న్ సబ్సిడీ మరో రూ. 6.96 కోట్లు మేర సొసైటీలకు చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేయలేదు.

# ప్రజలను ఏకం చేయాలి

న్యూఢిల్లీ, కులాల కుంపట్లు రగిలించడమే లక్ష్యంగా రాజకీయాలు నడుస్తున్నాయి. బిసి కులగణనే ఇందుకు నిదర్శనం. దేశంలో పౌరులంతా ఒక్కటే అన్న భావన రాకుండా రాజకీయ పార్టీలు చాలా తెలివిగా తమ చాతుర్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. ప్రజల్లో కులమతాలు, వర్గ విభేదాలు లేకుండా అంతా భారతీయులమే అన్న భావన లేకుండా చేస్తున్న వారిలో విపక్షాలు ముందు వరసలో నిలుచున్నాయి. అందుకే వారు తమ ఓటు బ్యాంక్ రాజకీయాలను ప్రయోగిస్తున్నారు. ప్రజలు ఎప్పటికీ ఒక్కటి కాకుండా చూసుకోవడం వాటి లక్ష్యంగా కని పిస్తోంది. ఉమ్మడి పౌరస్మృతి విషయంలో రాజకీయపార్టీలు అనుసరిస్తున్న తీరు దేశద్రోహ చర్యగానే భావించాలి. ఎందుకంటే ఏ దేశంలో అయినా ప్రజలందరికీ ఒకేరకమైన హక్కులు ఉంటాయి. ఒకే రకమైన చట్టాలు ఉంటాయి. కానీ ఏం దౌర్భాగ్యమో భారత్‌లో మాత్రమే ఇలా వేర్వేరుగా చట్టాలు ఉంటాయి. ఉండాలని కమ్యూనిస్ట, కాంగ్రెస్ పార్టీలు కోరుకుంటున్నాయి కూడా. చట్టాలు ఒకేరకంగా ఉండడానికి వీలులేదన్న కుత్సిత భావనలో రాజకీయపార్టీల నేతలు ఆలోచిస్తున్నారు. ఈ విషయంలో కమ్యూనిస్టులంత గోడవాటం గాళ్లు ..దేశంలో మరొకరు ఉండరు. చైనా, రష్యా, క్యూబా గురించి మాట్లాడుతున్న ఎర్ర జెండా వాళ్లకు భారత్‌లో మాత్రం ప్రజలందరి రక్తం ఒక్కటే అన్న సోయి ఉండదు. ఎవరి రక్తం వారిదే అన్న వాదన లో ఉంటారు. ఉపన్యాసాలు ఇచ్చే సమయంలో మాత్రం మనమంతా ఒక్కటే.. మనందరిలోని రక్తమంతా ఒక్కటే అంటారు. కులమతాల అడ్డుగోడలు తొలగాలనేది వారే.. కులమాతాలకు అనుగుణంగా చట్టాలు ఉండాల్సింది అని పట్టుబడేది వారే. ఇలా అయితే దేశం మరో వందేళ్లయినా అభివృద్ధి చెందదని గుర్తించాలి. కమ్యూనిస్టులు.. వారిని అనుసరిస్తున్న వారు తమ ఆలోచనా ధోరణి బూజుపట్టిందన విషయం తెలుసు కోవడం లేదు. ఉమ్మడి పౌరస్మృతి విషయంలో వారు ఆడుతున్ననాటకాలు దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి తప్ప మరోటి కాదు. మతపరమైన ఆచారాలు, సంప్రదాయాలకు అతీతంగా దేశంలోని పౌరులందరికీ ఒకే చట్టం వర్తించాలన్నది బిల్లు లక్ష్యం. నిజానికి మతాచారాలు ఎవరికి వారు నిర్వహించుకోవచ్చు. మర్డర్లు, రేపులు, దొంగతనాలు, పెళ్లిల్లు చేసుకునే సమయంలో చట్టం అందిరికీ ఒకేలా ఉండాలి. అంటే.. పెండ్లిళ్లు, విడాకులు, వారసత్వం, దత్తత, జీవన భృతి అంటే..భరణం, మనోవర్తి, ఇతరత్రా మొదలైన అన్ని అంశాల్లో కుల, మత, వర్గాలకు అతీతంగా పౌరులందరికీ ఒకే చట్టం ఉండాలన్న విశాల దృక్పథాన్ని విపక్షాలు అడ్డుకుంటున్నాయని గుర్తించాలి. నిజానికి దేశంలో ఇప్పటి వరకు మతపరమైన చట్టాలే ఉన్నాయి. హిందూ వివాహ, వారసత్వ చట్టాలు, షరియా లాంటి ముస్లిం పర్సనల్ చట్టాలు అమలవుతున్నాయి. వీటివల్ల ఎన్ని గందరగోళాలు వస్తున్నాయో చూస్తూనే ఉన్నాం. అందరిదీ ఒకే రక్తం అంటున్న వారు అందరికీ ఒకే రకమైన న్యాయం,చట్టం ఉండాలన్న సోయిని మరచి వ్యవహరిస్తున్నారు. మన దేశం ఒక లౌకిక రాజ్యంగా ఉండాలని, సర్వమత సమానత్వాన్ని పాటించాలని, అన్ని భాషలను గుర్తించి గౌరవించాలని రాజ్యాంగంలో అనేక అంశాలను చేర్చారు. కానీ ఇన్నేళ్లయినా కుల మతాల కారణంగా ప్రజలందరూ భయం భయంగా బతికే వాతావరణం దేశంలో చూస్తున్నాం. కులమతాలు వారి ఆచార వ్యవహారాలు ఇంటికే పరిమితం కావాలి. చట్టం ముందు అంతా ఒక్కటే అన్న భావనరావాలి. అంటే ఉమ్మడి పౌరస్మృతి ద్వారానే ఇది సాధ్యం అవుతుంది. భారత దేశ సమగ్రతను, సమ భావాన్ని గౌరవించే వాళ్ళందరూ ఏకోన్ముఖంగా పౌరస్మృతిని కోరాల్సిందే. నరేంద్ర మోడీ ప్రధాని అయిన తర్వాత భారత దేశాన్ని ఐక్యంగా ఉంచాలని చేస్తున్నప్రయత్నాలకు అడుగడున్నా అడ్డుకుంటున్నారు. రాజ్యాంగానికి ప్రమాదం వచ్చిందని గగ్గోలు పెడుతున్నారు. వీరి మాటలు పట్టించుకుని ఉంటే కాశ్మీర్‌లో 370 రద్దయ్యేది కాదు. ఎందుకంటే వారికి ఓట్లు తప్ప దేశం గురించి పట్టదు. దేశాన్ని ఎందుకు విడదీశారో..మతప్రాతిపదిక ఎందుకు ఆ పనిచేశారో చర్చ చేయరు. భారత దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టంగా అమలు కావాలంటే ఏకభావన రావాలి. సమాన హక్కులు ఉండాలి. ప్రజలంతా ఒక్కటే అన్న భావన పాదుకొల్పాలి. ఇంకా పేదలను పేదలుగా, మైనార్టీలను ఇంకోరకంగా చూసే సంస్కృతి పోవాలి. దానిని వదిలి కులగణన చేయాలన్న తీరు సరికాదాఉ. ప్రతి ఒక్కరూ మనమంతా ఒక్కటే అన్న భావన కోసం చేసే ఎలాంటి ప్రయత్నాన్ని అయినా స్వాగతించాల్సిందే. ప్రజా వ్యతిరేక చర్యలను రెచ్చగొడుతూ..

# మహిళ మీద కన్నేసి బాలిక హత్య

మేడ్చల్, సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో దసరా పండుగ రోజు జరిగిన దారుణ ఘటనపై పోలీసులు కూపీ లాగి ఛేదించారు. అదృశ్యమైన ఏడేళ్ల చిన్నారి చివరికి ఓ సంచిలో మృతదేహమై కనిపించడంతో కేసు విషాదాంతమైంది. ఈ కేసును మేడ్చల్ జిల్లా సూరారం పోలీసులు ఛేదించారు. నిందితుడిని అరెస్ట్ చేసి విచారించగా, అసలు విషయం వెలుగుచూసింది. వివాహిత మీద కన్నేసిన నిందితుడు ఆమె కుమార్తెను హత్య చేశాడు. మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా బేల మండలం పాటగూడ గ్రామానికి చెందిన మిశ్రమ్ ప్రభాకర్ (40) ఏడు నెలల క్రితం హైదరాబాద్ వచ్చాడు. ఇద్దరు కుమార్తెలు ఉన్న గ్రామానికే చెందిన మహిళతో కలిసి కుత్బుల్లాపూర్ పరిధి సూరారం జీవన్ జ్యోతినగర్ లో ఉంటున్నాడు. కూలి పనులు చేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మహిళకు ఇద్దరు కూతుళ్లు కాగా, పెద్ద కూతురు జోష్న వయసు ఏడేళ్లు. ఈ క్రమంలో ప్రభాకర్ కు ఆ ప్రాంతానికే చెందిన తిరుపతి అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ప్రభాకర్ తన ఇంట్లోనే తిరుపతితో కలిసి తరుచూ మద్యం సేవించేవాడు. ఆ క్రమంలో ప్రభాకర్ ఇంట్లో ఉన్న మహిళపై తిరుపతి కన్నేశాడు. ఇద్దరు పిల్లలు, ప్రభాకర్ అడ్డు తొలగించుకుంటే ఆ వివాహితను తన సొంతం చేసుకోవాలని భావించాడు. తన ప్లాన్ ప్రకారం అక్టోబర్ 12న ఉదయం వివాహిత పెద్ద కుమార్తె (7)ను తన ఇంటికి తీసుకెళ్లాడు. మధ్యాహ్నం తిరుపతి ఆ బాలికను తిరిగి తీసుకొచ్చి ప్రభాకర్ ఇంట్లో వదిలేశాడు. సాయంత్రం మరోసారి ప్రభాకర్ ఇంటికి వచ్చి చూడగా, ఎవరూ లేరని తెలుసుకున్నాడు. దాంతో బాలికకు మరోసారి మాయ మాటలు చెప్పి బైకు మీద తీసుకెళ్లాడు. అయితే రాత్రి అయినా బాలిక ఇంటికి తిరిగి రాకపోవడంతో ప్రభాకర్, మహిళ కలిసి సూరారం పోలీసులను ఆశ్రయించారు. బాలిక అదృశ్యమైందని ఫిర్యాదు చేసి వివరాలు ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ప్రత్యేక బృందాలతో బాలిక ఆచూకీ కోసం గాలించారు. ఈ క్రమంలో మేడ్చల్ పోలిస్‌స్టేషన్ పరిధి బాసరేగడి గ్రామం సమీపంలో ఓ సంచిలో బాలిక మృతదేహం కనిపించింది. ఆ డెడ్ బాడీ అదృశ్యమైన చిన్నారిదేనని నిర్ధారించారు. బాలిక కనిపించకుండా పోయిన తరువాత నుంచి తిరుపతి జాడ లేకపోవడంతో పోలీసుల ఆ కోణంలోనూ దర్యాప్తు చేపట్టారు. బాలికను బైకు మీద తీసుకెళ్లినట్లు సీసీ కెమెరాల ద్వారా ద్వారా గుర్తించిన పోలీసులు మంగళవారం నిందితుడు తిరుపతిని అరెస్ట్ చేశారు.నిందుతుడు తిరుపతిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారని మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. చిన్నారిని బైకు మీద తీసుకెళ్లిన తిరుపతి బాసరగడి గ్రామం దగ్గర కత్తితో చిన్నారి గొంతు కోశాడు. కడుపుతో సైతం కత్తితో పొడిచి బాలికను చంపినట్లు నిందితుడు తిరుపతి అంగీకరించాడు. బాలిక మృతదేహాన్ని ఓ సంచిలో మూటకట్టి సమీపంలోని అటవీ ప్రాంతంలో విసిరేసి పారిపోయినట్లు తెలిపాడు.

# అదానీకి ఎదురుదెబ్బ



న్యూఢిల్లీ,ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో దేశంలోనే అగ్రస్థాయి వాణిజ్యవేత్తగా ఎదిగిన గౌతమ్ అదానీ విదేశీ విస్తరణ ప్రణాళికకు బ్రేకు పడింది. కెన్యాలో ఆయన దక్కించుకోవాలనుకున్న అంతర్జాతీయ విమానాశ్రయం కాంట్రాక్టు చిక్కుల్లో పడింది. రాజధాని నైరోబీలోని జోమో కెన్యాటా ఎయిర్ పోర్టు నిర్వహణను అదానీ కంపెనీకి 30 ఏండ్ల పాటు లీజుకు ఇచ్చేందుకు అక్కడి ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. తన ప్రియమిత్రునికి ఈ ప్రాజెక్టును ఇప్పించేందుకు ప్రధాని మోదీ తెరవెనుక పావులు కదిపారనే వార్తలు ఇదివరకే గుప్పుమన్నా యి. ఒప్పందంపై సంతకాలు పెట్టే సమయం దగ్గరవుతున్న కొద్దీ ప్రాజె క్టు చుట్టూ వివాదాలు ముసురుకున్నాయి. ఒప్పంద అంశాల రాజ్యాంగబద్ధతను ప్రశ్నిస్తూ కెన్యా మానవ హక్కుల కమిషన్, కెన్యా న్యాయవాద సంఘం కేసులు వేయడంతో తదుపరి నిర్ణయం వరకు అదానీ ప్రతిపాదనపై కోర్టు స్టే విధించింది. సెనేట్ విచారణలోనూ కెన్యా ప్రభుత్వం తీవ్ర విమర్శలకు గురైంది. గత నెల నిరసన ప్రదర్శనలు జరిపిన విమానాశ్రయ సిబ్బంది ఇటీవలే సమ్మెకు దిగి విమానాల రాకపోకలకు అంతరాయం కలిగించడం గమనిస్తే ప్రాజెక్టుపై వ్యతిరేకత ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. దేశవ్యాప్త నిరసనల మధ్య కెన్యా ప్రభుత్వం అదానీ ప్రాజెక్టు విషయంలో వెనుకకు తగ్గడం ఒక ఎత్తయితే మోదీ గుజరాత్ సీఎంగా ఉన్నప్పటి నుంచీ అదానీ కంపెనీలను ప్రోత్సహిస్తున్నారని కెన్యా మాజీ ప్రధాని ఓడింగా వెల్లడించడం ఒక ఎత్తు.ఇప్పటికే పలు సమస్యలతో సతమతమవుతున్న కెన్యా అధ్యక్షుడు విలియం రూటో ప్రభుత్వానికి అదానీ వ్యవహారం గుదిబండగా మారిం ది. ఇటీవలే ఎయిర్‌పోర్టు ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను సామాజిక కార్యకర్త నెల్సన్ అమెన్యా సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో బయటపెట్టినప్పటి నుంచి రాజకీయ దుమారం రేగింది. అనేక ఇతర కంపెనీలు ప్రతిపాదనలు పంపినా కెన్యా ప్రభుత్వం పట్టించుకోలేదని, అదానీ కంపెనీని ఏరి కోరి ఎంపిక చేసిందనే సంగతి తేటతెల్లమైంది. అంతర్జాతీయ టెండర్లు పిలవకుండా, లోపల్లోపల బంగారు బాతులాంటి ఎయి ర్ పోర్టును అదానీ పరం చేయడంపై గగ్గోలు బయల్దేరింది. అదానీ డిమాండ్లకు తలొగ్గాల్సిన అవసరం లేదని, ఎయిర్ పోర్టుకు అవసరమైన పెట్టుబడిని కెన్యా సొంతంగా సేకరించుకోవచ్చని పలువురు ప్రజా ప్రతినిధులు కెన్యా ప్రభుత్వానికి సూచించడం గమనార్హం.దేశంలోని వాణిజ్యవేత్తలను లేదా కంపెనీలను సమదృష్టితో చూడాలి. కానీ, గత పదేండ్లుగా దేశాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలిస్తున్న ప్రధాని మోదీ తన మిత్రుడు అదానీని కొంచెం ఎక్కువ సమదృష్టితో చూస్తున్నారనేది బహిరంగ రహస్యమే. భారత భూభాగం మీదే కాదు, విదేశాల్లోనూ అదానీకి కాంట్రాక్టులు ఇప్పించేందుకు మోదీ ఉత్సాహం చూపుతుంటారు. అయితే, విదేశీ కాంట్రాక్టులు ఇప్పించడం, మెప్పించడమనేది అంత తేలిక కాదు. గతంలో శ్రీలంకలో విద్యుత్తు ప్రాజెక్టు విషయంలో అదానీ కంపెనీ విమర్శల పాలైంది. ఇప్పుడు కెన్యా విషయంలో జరిగినట్టుగానే అప్పుడూ ప్రధాని మోదీ అదానీ తరఫున ఒత్తిడి తెచ్చినట్టు శ్రీలంక నేతలు ఆరోపించడం తెలిసిందే. అదానీ గ్రూప్‌పై సంచలన ఆరోపణలు చేసిన హిండెన్‌బర్గ్ సంస్థ గ్రూప్‌పై స్విట్జర్లాండ్‌లో మనీలాడరింగ్ కేసులు దాఖలైనట్టు వెల్లడించడం ప్రకంపనలు సృష్టిస్తున్నది. అటు అమెరికాలో ముడుపుల ఆరోపణలు నమోదైనట్టు బ్లూంబెర్గ్ వెల్లడించింది. అయితే, ఈ ఆరోపణలన్నిటిని అదానీ గ్రూపు ఎప్పటికప్పుడు ఖండిస్తూనే ఉన్నది. ఈ వివాదాలు ఆయా అంశాలకే పరిమితం కావు. దేశాలతో మైత్రిపై వాటి ప్రభావం ఉంటుందని గుర్తుంచుకోవాలి. కెన్యాలో అదానీ ప్రాజెక్టులపై వ్యక్తమవుతున్న నిరసనలు కాలక్రమంలో భారత వ్యతిరేకతగా పరిణమించే ప్రమాదమున్నదనే హెచ్చరికలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఒక వాణిజ్యవేత్తపై పాలకుల మమకారం విదేశాలతో సంబంధాలు దెబ్బతినడానికి కారణం కావడం ఏ మాత్రం వాంఛనీయం కాదు.

# టెక్ కంపెనీల్లో ఉద్యోగాల కోత

న్యూఢిల్లీ,టెక్ కంపెనీల్లో ఉద్యోగాల కోత కొనసాగుతూనే ఉంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ మాతృసంస్థ మెటా మరింతమంది ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమైంది. దీర్ఘకాలిక వ్యూహాత్మక లక్ష్యాల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. లేఆఫ్‌ల విషయాన్ని కంపెనీ ధ్రువీకరించినప్పటికీ ఎంత సంఖ్యలో ఉద్యోగులను తొలగిస్తుందనే సమాచారాన్ని మాత్రం వెల్లడించలేదు.మెటా పరిధిలో ఉన్న వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, వర్చువల్ రియాలిటీపై పనిచేస్తున్న రియాలిటీ ల్యాబ్.. ఇలా అన్ని వ్యాపారాల్లో ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకోనున్నట్లు తెలుస్తోంది. రిక్రూటింగ్, లీగల్ ఆపరేషన్, డిజైన్... వివిధ రంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులపై ఈ ప్రభావం పడనుంది. దీర్ఘకాలిక వ్యూహాత్మక లక్ష్యాలు, ప్రాంతీయ వ్యూహాల్లో మార్పులు చేస్తున్నామని మెటా అధికారిక ప్రతినిధి తెలిపారు. అందులోభాగంగానే ఈ తొలగింపులు చేపడుతున్నట్లు వెల్లడించారు. అయితే మెటా నుంచి ఉద్వాసన పలికిన ఉద్యోగులకు ప్రత్యామ్నాయ అవకాశాలు అందించేందుకు కంపెనీ ప్రయత్నం చేస్తున్నట్లు పేర్కొన్నారు. 2022లో మెటా ఏకంగా 11వేల మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. గతేడాదిలో మరో 10వేల మందిని ఇంటికి పంపింది. తాజాగా మరో రౌండ్ లేఆఫ్‌లకు సిద్ధమైంది. అయితే ఈసారి తొలగింపులు తక్కువ సంఖ్యలోనే ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే మెటా నుంచి లేఆఫ్‌కు గురైనట్లు కొందరు ఉద్యోగులు సామాజిక మాధ్యమాల వేదికగా పోస్టులు పెడుతున్నారు. ఇదిలాఉండగా.. టెక్ కంపెనీలు ఆర్థిక ఒత్తిళ్లు, సైబర్ సెక్యూరిటీపై పెట్టుబడులు, ఏఐ సాంకేతికతను అందిపుచ్చుకోవడం కోసం పెద్దఎత్తున పెట్టుబడులు పెడుతున్నారు. ఇక ఖర్చుల్ని తగ్గించుకొనే ప్రయత్నంలో భాగంగా ఉద్యోగులను తొలగిస్తున్నారు. ఇప్పటికే ఇంటెల్ (ఎనిబిı), సిస్కో (అతిబఇఃనీ), ఐబీఐ కంపెనీలు పెద్ద ఎత్తున ఉద్యోగులకు ఉద్వాసన పలికాయి. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇంటెల్ ఏకంగా 15శాతం మంది ఉద్యోగులను తగ్గించుకుంది. ఇలా ఈ ఏడాది ఆగస్టు నాటికి 422 కంపెనీలు ఏకంగా 1,36,000 మందిని తొలగించాయి.

# దక్షిణ కొరియా శతృదేశమే

న్యూఢిల్లీ,ఉత్తర, దక్షిణ కొరియాల మధ్య శత్రుత్వం ఇప్పటిది కాదు. ఇరుదేశాల మధ్య వైరం నేటికీ కొనసాగుతోంది. ఈక్రమంలో ఉత్తర కొరియా కీలక నిర్ణయం తీసుకుంది. దక్షిణ కొరియాను శత్రుదేశంగా పరిగణిస్తూ తమ రాజ్యాంగంలో మార్పులు చేపట్టినట్లు ఉత్తర కొరియా తాజాగా వెల్లడించింది. 1991లో ఉత్తర- దక్షిణకొరియా దేశాల మధ్య జరిగిన కీలక ఒప్పందాన్ని కిమ్ సర్కారు రద్దు చేసుకోవాలని నిర్ణయించింది. అందులోభాగంగా తమ రాజ్యాంగంలో న్యాయపరమైన సవరణలు చేయాల్సిఉందని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ ఈ ఏడాది ప్రారంభంలో వ్యాఖ్యానించారు. అధ్యక్షుడి ఆదేశాల మేరకే రాజ్యాంగంలో మార్పులు చేసినట్లు పాగ్యాంగ్ వెల్లడించింది. దక్షిణ కొరియాను శత్రుదేశంగా పరిగణించడం అనివార్యమైన, న్యాయపరమైన చర్యగా కిమ్ సర్కార్ పేర్కొంది. అయితే ఈ రాజ్యాంగ సవరణలకు సంబంధించిన మరిన్ని విషయాలు వెల్లడికావాల్సి ఉంది. ఇటీవల ఉత్తర, దక్షిణ కొరియాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. మే చివరివారం నుంచి దక్షిణ కొరియా గగనతలంపైకి వేల సంఖ్యలో చెత్త బెలూన్లు పంపుతుంది. ఈక్రమంలోనే దక్షిణ కొరియాతో తమకున్న సరిహద్దును పూర్తిగా మూసివేస్తున్నట్లు కిమ్ సర్కారు నిర్ణయించింది. అందులోభాగంగా ఇరుదేశాలను కలిపే రోడ్లు, రైల్వే మార్గాలను ఉత్తర కొరియా బాంబులతో పేల్చివేసింది. అయితే.. ఈ రోడ్లు, రైల్వే మార్గాల తొలగింపును సైన్యం దశలవారీగా పూర్తి చేస్తుందని వెల్లడించింది. మరోవైపు ఉత్తరకొరియా సరిహద్దుల వెంబడి తన సైన్యాన్ని పటిష్టం చేస్తుంది.

# సంచలన వ్యూహం!

హైదరాబాద్, స్థానిక సంస్థల ఎన్నికలపై సీఎం రేవంత్ ఫోకస్ పెట్టారు. గ్రామాల్లో కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు ఇందిరమ్మ కమిటీలను ఆయుధంగా వాడనున్నారు. ఈ కమిటీల ద్వారా గ్రామాల్లోని ప్రజలను ఒకదగ్గరికి చేర్చనున్నారు. అందుకోసం మాస్టర్ ప్లాన్‌ను రెడీ చేసినట్లు సమాచారం. తెలంగాణలో గడప గడపకు కాంగ్రెస్ పార్టీని తీసుకెళ్లాలని సీఎం రేవంత్ రెడ్డి వ్యూహాలు రచిస్తున్నారు. ప్రభుత్వ పథకాలు అమలు చేయడం వల్ల గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇందిరమ్మ కమిటీల ద్వారా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెచ్చేందుకు సిద్ధమయ్యారు. ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వచ్చిన తరువాత ఇళ్లులేని వారు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇల్లు కట్టుకునేందుకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అందిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే.

కొత్త తలనొప్పిగా మారొద్దు...

ఇటీవల ఇందిరమ్మ ఇళ్ల లబ్ధి దారులను ఎంపిక చేసేందుకు తెలంగాణ సర్కార్ ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీలను గ్రామాల్లో, మున్సిపాలిటీలలో అమల్లోకి తెచ్చేలా చూడాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చింది. అయితే.. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కమిటీలపై భిన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. లబ్ధి దారుల ఎంపిక విషయంలో పక్షపాతం చూపుతారనే చర్చ కూడా జోరందుకుంది. అయితే ఈ కమిటీ వల్ల రేవంత్ సర్కార్ కు లాభం ఎంత ఉందో నష్టాలు కూడా అంతే ఉన్నాయి. ఒకవేళ ఇళ్ల మంజూరు విషయంలో ఈ కమిటీ పక్షపాతంగా వ్యవరిస్తే గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీపై వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంది. ఇది ముందే గమనించిన సీఎం రేవంత్ లబ్ధి దారుల ఎంపిక విషయంలో వివక్ష చూపొద్దని.. అర్హులైన లబ్దిదారులను మాత్రమే ఎంపిక చేయాలని ఎక్కడైనా పక్షపాతం చూపించినట్లుగా ఆరోపణలు వస్తే ప్రజల్లో వ్యతిరేకత వస్తుందని చెప్పారు.

రుణమాఫీ తెచ్చిన తంటా...

ఎన్నికల సమయంలో ఇచ్చిన రూ.2లక్షల రుణమాఫీ హామీని అమలు చేసింది రేవంత్ సర్కార్. అయితే.. ప్రతిపక్షాలకు ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ కార్యక్రమం పెద్ద ఆయుధంగా మారింది. రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. రెండు బీలక్షల రూపాయల రుణమాఫీ చేయలేదని విమర్శలు చేసింది. మరోవైపున కాంగ్రెస్ నేతలు రుణమాఫీపై రోజుకో మాట మాట్లాడడం ప్రభుత్వంపై వ్యతిరేకతకు కారణమైంది. రూ.2లక్షల వరకు రుణమాఫీ చేశామని కొందరు మంత్రులు సైతం చెప్పగా.. మరికొంత మంది కాంగ్రెస్ నేతలు మొత్తం రుణమాఫీ చేశామని చెప్పడం రైతులను గందరగోళంలోకి నెట్టింది. తాజాగా మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఈ నెల ఆఖరి లోగా రుణమాఫీ ముగుస్తుందని హామీ ఇచ్చారు. అలాగే త్వరలో రైతు భరోసా కింద ఎకరాకు రూ.7500 ఇస్తామన్నారు. గ్రామాల్లో ప్రతిష్ఠాత్మకంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ అంశం వివాదాల చుట్టూ నడుస్తూ వస్తోంది. కాగా రుణమాఫీ అంశంపై జరిగిన తప్పులను సరి చేసుకుంటూ.. ఇందిరమ్మ కమిటీల విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని కాంగ్రెస్ వ్యూహాలు రచిస్తోంది.

# షాకింగ్ చర్చ

హైదరాబాద్,తెలంగాణ రాష్ట్ర సమితికి ఆ పార్టీ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ప్రమోషన్ ఇచ్చి భారత రాష్ట్ర సమితిగా మార్చి జాతీయ పార్టీని చేశారు. ఇక తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ చరిత్ర గర్భంలో కలిసిపోయిందనీ, ఇక బీఆర్ఎస్ పార్టీ జాతీయ స్థాయిలో చక్రం తిప్పుతుందనీ ఆర్భాటంగా ప్రకటించి సొంత రాష్ట్రంలోనే బొక్కబోర్లా పడ్డారు. ఇప్పుడు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్ పార్టీకి పెద్ద దిక్కైతే కేసీఆర్ ఫాంహౌస్‌లో రెస్ట్ తీసుకుంటున్నారు. అయితే కేటీఆర్ వ్యవహరిస్తున్న తీరు ఇస్తున్న స్టేట్‌మెంట్లు చూస్తుంటే ఆయన పొలిటీషియనేనా? అన్న డౌట్లు వస్తున్నాయి. ఇది వేరెవరో అంటుంది కాదండోయ్ సొంత పార్టీ శ్రేణులే కేటీఆర్ తీరుపై విస్మయం వ్యక్తం చేస్తున్నాయంట. అదేంటంటారా? మీరే ఆలకించండికేసీఆర్ తనయుడు, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారకరామారావు మాత్రం ఇంకా బీఆర్ఎస్ ఉనికిని, తమది జాతీయ పార్టీ అని తండ్రి ప్రకటించారని గుర్తించడం లేదని ఎప్పుడో తేలిపోయింది. తాను స్వయంగా భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడైనప్పటికీ.. పక్క రాష్ట్రాల్లో తమ శాఖలున్నాయని మర్చిపోయినట్లు స్టేట్ మెంట్లు ఇచ్చారు. తెలుగుదేశం అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి అరెస్టుకు వ్యతిరేకంగా ఏపీలోనే కాదు.. దేశ వ్యాప్తంగా, ఇతర దేశాల్లో కూడా నిరసనలు వెల్లువెత్తాయి.. రాష్ట్రాలు, ప్రాంతాలు, రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలు అఅరెస్టును ఖండిస్తూ రోడ్లపైకి వచ్చి నిరసన ర్యాలీలు నిర్వహించారు.అలాగే తెలంగాణ రాజధాని హైదరాబాద్ లోనూ ఐటీ ఉద్యోగులు భారీ ర్యాలీలు నిర్వహించారు. అయితే తెలంగాణ సర్కార్ మాత్రం ఆ ర్యాలీలపై ఉక్కుపాదం మోపింది. ఎక్కడో ఏపీలో జరిగిన రాజకీయ అరెస్టు విషయంలో ఇక్కడ ఆందోళనలు ఏంటని కేటీఆర్ మీడియా మీట్ పెట్టి మరీ అడిగారు. అప్పుడు బీఆర్ఎస్ ఏపీ శాఖ ఒకటి ఉందనీ, దానికి ఏపీలో ఓ కార్యాలయం ఉందనీ మరిచిపోయినట్లు మాట్లాడారు. ఏపీ రాజకీయాలు మనకెందుకు అంటూ మీడియా సమావేశంలో ప్రశ్నించిన కేటీఆర్ ను నెటిజన్లు ఓ రేంజ్ లో ట్రోల్ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్ గా గుర్తించి నమోదు చేసిన తరువాత కూడా కేటీఆర్ తమది ఇంకా టీఆర్ఎస్ పార్టీయే అనడంపై అప్పట్లో గులాబీ శ్రేణులే విస్మయం వ్యక్తం చేశాయి.తర్వాత ఆ పార్టీ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి తనకు సంబంధం లేని వ్యవహారంలో వేలు పెట్టి శేరిలింగంపల్లి ఎమ్మెల్యేని నాన్ లోకల్ అన్నప్పుడు కేటీఆర్ కౌశిక్‌ని వెనకేసుకొచ్చి మాట్లాడి ఆ పార్టీని ఆదరించిన గ్రేటర్ పరిధిలోని సెటిలర్లకు షాక్ ఇచ్చారు. ఆ క్రమంలో అధికారం కోల్పోయాక పార్టీ పెద్దగా ఆయన ప్రతి అంశాన్ని రాజకీయం చేస్తూ ఇస్తున్న స్టేట్‌మెంట్లపై ఆ పార్టీ నేతలే ముక్కున వేలేసుకుంటున్నారంట. నాడు బీఆర్ఎస్ హయంలోనే మూసీ రి డవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటైంది. మూసీ పరివాహక ప్రాంతంలో రివర్ బెడ్, బఫర్ జోన్‌లుగా మార్కింగ్ కూడా చేశారు.ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మూసీ ప్రక్షాళనపై పట్టుదలతో ఉంది . అయితే కేటీఆర్ మాత్రం మూసీ పరివాహక ప్రాంతం ప్రజలను రెచ్చ గొడుతూ స్టేట్‌మెంట్లు ఇస్తున్నారు. వారి పక్షాన నిలబడి పోరాడతానంటూ పాతవి మర్చిపోయినట్లు మాట్లాడుతున్నారు. ఇక అప్పట్లో ఫాక్స్‌కాన్ కంపెనీ తమ చొరవతోనే వచ్చిందని ఆయన ఘనంగా ప్రకటించుకున్నారు. ఆ కంపెనీతో లక్ష మందికి ఉద్యోగ అవకాశాలు ఉంటాయని గొప్పగా చెప్పుకున్నారు. ఇప్పుడేమో ఫాక్స్‌కాన్ కంపెనీ తరలిపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తూ గులాబీ శ్రేణులకు కూడా అర్థం కాకుండా మాట్లాడుతున్నారు.తాజాగా దామగుండంలో శంకుస్థాపన జరిగిన నేవీ రాడార్ స్టేషన్ చుట్టూ కేటీఆర్ రాజకీయం మొదలు పెట్టారు. దామగుండం ప్రాజెక్ట్ నిర్మిస్తే మూసీ నది కనుమరుగవుతుందని, మూసీకి ముఖ్యమంత్రే మరణశాసనం రాస్తున్నారని కేటీఆర్ ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లు తమ ప్రభుత్వంపై కేంద్రం ఎంత ఒత్తిడి తెచ్చినా తాము అంగీకరించలేదని, కానీ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రయోజనాలను తాకట్టు పెడుతూ వేల ఎకరాల అటవీ భూములను నాశనం చేయడానికి పూనుకుందని మండిపడ్డారు.

# పటిష్ట ప్రణాళికలతో ముందుకు సాగాలి !



హైదరాబాద్,తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను నెరవేరుస్తామని అంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందుకు తగ్గట్లుగా అడుగులు వేయాలి. నీళ్లు, నిధులు,నియామకాలు అన్న ఆకాంక్షలు త్వరగా నెరవేర్చాలి. ఇదే సందర్భంలో ఇక ఉచిత పథకాలను దరిచేరకుండా పటిష్టమైన ఆర్థిక వ్యవస్థను రూపొందించుకోవాలి. రైతుబంధు, రైతు రుణమాఫీలు,రూపాయికి కిలోబియ్యం, ఆరోగ్యశ్రీ వంటి పథకాలకు చెక్ పెట్టాలి. పంటలను పూర్తి స్థాయిలో గిట్టుబాటు ధరలకు కొనడమే రైతులను ఆదుకోవడం అవుతుంది. వారికి సకాలంలో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచడం, పంటరుణాలను అందించడం,నీట వసతి కల్పించడం ప్రధాన ఎజెండా కావాలి. ఇవన్నీ కల్పించి పండించిన పంటలను సకాలంలో కొనుగోలు చేసే వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. ప్రకృతి వైపరీత్యాల్లో ఆదుకునేలా ఉండాలి. చిన్ననీటి వనరులను అభివృద్ధి చేయాలి. ఇలా చేస్తే వ్యవసాయంతో పాటు, అనుబంధ రంగాలు కూడా అభివృద్ధి చెందుతాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. ఇవి చేయకుండా నేలవిడిచి సాము చేయడం సరికాదు. అలాగే విద్యావైద్య రంగాలను కూడా గ్రామస్థాయి లో పటిష్టం చేయాలి. సాగు,తాగునీటి వనరులతో పాటు, పంటలు పండే భూములకు ఇక్కడ కొదువలేదు. పనిచేయడానికి జనం ఉన్నారు. వీటి ఎలా ఉపయోగించాలన్నది నేతల సమర్థత మీద ఆధారపడి ఉంది. పథకాలు, పందేరాలతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకుని వెళ్లడం అసాధ్యం అని గుర్తించాలి. అలాగే గత కెసిఆర్ ప్రభుత్వంలా అభూతకల్పనలు,భ్రమలు కల్పించడం మానుకోవాలి.అప్పుడే గ్రామాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయి. పంచాయితీలను పటిష్టం చేసి వాటి ద్వారానే గ్రామాల పురోభివృద్ధికి పాటుపడాలి. రాజ్యాంగం ఇచ్చి అధికారాలను పంచాయితీలకు దఖలు పర్చాలి. తెలంగాణ ప్రజల బతుకులు మారాలన్న ఏకైక లక్ష్యంతో పోరాటం చేసి సాకారం చేసుకున్న ప్రత్యేక తెలంగాణ ఏర్పడి పదేళ్లు పూర్తి అయ్యాయి. నిజానికి ఇలాంటి చిన్న రాష్ట్రంలో అన్ని వనరులు ఉన్నా ప్రజల ఆకాంక్షలు తీరలేదు. ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పదేళ్లు కల్వంకుంట్ల కుటుంబం రాజభోగాలు అనుభవించింది. గడీల పాలన అందించింది. దీనిని నిందిస్తూ కాలయాపన చేయకుండా రేవంత్ సర్కార్ ముందుకు సాగాలి. అలాగే ఈ పదేళ్లలో తెలంగాణలో ఎవరి బతుకులు మారాయన్నది గమనిస్తే.. రాజకీయ పార్టీల్లో కొందరి బతుకులు మారాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంతో ప్రజల బతుకులు అలాగే ఉన్నాయి. ఈ క్రమంలో పదేళ్ల పాలనపైనా, ప్రజల జీవన చిత్రంపైనా చర్చించి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. రేవంత్ ప్రభుత్వం గత విధ్వంసాలను గుర్తించి ముందుకు సాగాలి. ప్రజలు ఏం కోరుకుంటున్నారో చర్చించాలి. మూసపద్ధతిలో కాకుండా నిర్మాణాత్మక వైఖరితో ముందుకు సాగితే సింగపూర్, మలేషియా లాంటి చిన్నచిన్న దేశాలను అధిమించవచ్చు. నీళ్లు, నిధులు,నియామకాలు అన్న నినాదంలో ఏవీ సాకారం కాలేదు. గత ప్రభుత్వ తప్పిదాలను సమీక్షిం చుకుని ప్రజలు కోరుకుంటున్న విధంగా పాలన సాగించాలే కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేయాలి. లేకుంటే..రాజకీయాల్లో ప్రజలు తమదైన రీతిలో బుద్ది చెబుతారని గుర్తించాలి. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డ తరవాత తెలంగాణలో ప్రభుత్వ ఏర్పాటు లోనూ.. పథకాలను అమలు చేయడంలోనూ.. అంతకు మించిన స్వార్థ ప్రణాళికతో కెసిఆర్ తొమ్మిదిన్నరేళు పాలించారు. అందుకే ఆయన రాజకీయ జీవితం ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా అప్రతిహతంగా కొనసాగింది. కానీ ప్రజలనే వారు ఎల్లవేళలా దేగకళ్లు పెట్టుకుని చూస్తుంటారని గమనించలేదు. ఇవాళ తెలంగాణ అమరవీరుల కోసం కన్నీరు కారుస్తానంటే ప్రజలు నమ్మరు. తవ్వినకొద్దీ అవినీతి పుట్టలు బయటపడుతున్నాయి. ఒక్కో పథకం తవ్వేకొద్దీ అవినీతే తప్ప ప్రజలకు మేలు చేసిన ఆనవాళ్లు కానరావడం లేదు. కాళేశ్వరంతో పాటు అనేక ప్రాజెక్టులను కట్టినట్లు చెప్పి అవినీతిని పారించారు. చెరువులను పునరుద్దరించి గొలుసుకట్టు చెరువులకు ప్రాణం పోసామని డొల్ల మాటలు ప్రచారం చేశారు. మిషన్ భగీరథతో ఇంటింటికీ మంచినీరు సరఫరా చేసామని బుకాయించారు. హరితహారంతో పచ్చదనాన్ని పెంచామని చెప్పి పచ్చి అబద్దాలు చెప్పారు. అన్ని పథకాల్లో అవినీతి దాగివుందన్న సత్యం బయటకు రావడంతో ప్రజలతో పాటు ప్రపంచం కూడా విస్తుపోయింది.ప్రజలకు ఆదర్శ నేతగా నిలవాల్సిన కెసిఆర్ కేవలం తన కుటుంబం, తన బంధువుల కోసం స్వార్థ రాజకీయాలు చేసారని చెప్పడంలో సందేహం లేదు. ఓ రకంగా చెప్పాలంటే పదేళ్ల కెసిఆర్ పాలన అంతా గోబెల్స్ ప్రచారంతో సాగింది. ఇప్పుడు అధికారం కోల్పోవడంతో అదే పనిలో బిఆర్ఎస్ నేతలు ఉన్నారు. నిత్యం ఏదో ఒక ఆరోపణతో తమ గత పాపాలను బయటకు రాకుండా చూస్తున్నారు.తెలంగాణలో కెసిఆర్‌ను మించిన విజినరీ నేత లేదని అప్పుడూ, ఇప్పుడూ భ్రమింప చేస్తున్నారు. కరిమింగిన వెలగ పండులా ఆయన విజినరీ అంతా లోపాలపుట్ట అని తేలింది. అనేక ఆశలు,ఆశయాలతో, అమరుల త్యాగాల తో పురుడుపోసుకున్న తెలంగాణను అభివృద్ధిపథంలో తీసుకెళ్లేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నా, స్వార్థమనే పథకంలో కొట్టుకు పోయాయి. ఈ క్రమంలో పదినెలల రేవంత్ ప్రభుత్వం ఆర్భాటాలకు, అనవసర ఖర్చులకు, ఉచిత పథకాల జోలికి పోకుండా క్షేత్రస్థాయిలో సమస్యలపై దృష్టి సారించాలి. తెలంగాణ అభివృద్దిని మళ్లీ పట్టాలకు ఎక్కించాలి. తాము ఇచ్చిన గ్యారెంటీల పేరుతో కాలక్షేపం చేయకుండా గ్రామస్థాయిలో సమస్యలను ఆకళింపు చేసుకోవాలి. గ్రామాలను బలోపేతం చేసి అభివృద్ధి చేయాలి. నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మగౌరవ నినాదాలతో సాధించుకున్న ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షలను నెరవేర్చామన్న ఘనత సాధించాలి. ఉద్యోగాల కల్పన, గ్రామాల్లో ఉపాధి అవకాశాలు పెంచడం, వ్యవసాయాన్ని బలోపతేం చేయడం వంటి కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగించాలి.

# తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి

గుంటూరు, వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డి మంగళగిరి పోలీస్‌స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో విచారించాలని మంగళగిరి పోలీసులు నోటీసులు జారీ చేయడంతో ఆయన గురువారం విచారణకు హాజరయ్యారు. సజ్జల వెంట న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, మాజీ మంత్రి మేరుగ నాగార్జున తదితరులు ఉన్నారు. సజ్జలతో పాటు విచారణాధికారి వద్దకు తనను కూడా అనుమతించాలని పొన్నవోలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. వేలు చూపించి మరీ పోలీసులను బెదిరించారు. అయితే, విచారణ సమయంలో న్యాయవాదులను పోలీసులు అనుమతించలేదు. దీనికి కోర్టు అనుమతి తప్పనిసరి అని, ప్రస్తుతం విచారణకు సజ్జలను మాత్రమే అనుమతిస్తామని స్పష్టం చేశారు. దీంతో సజ్జల ఒక్కరే పోలీస్‌స్టేషన్ లోకి వెళ్లారు. మంగళగిరి డీఎస్పీ మురళీకృష్ణ, గ్రామీణ సీఐ శ్రీనివాసరావు విచారిస్తున్నారు. సజ్జల రామకృష్ణారెడ్డికి న్యాయస్థానం ఈనెల 24 వరకు మధ్యంతర ఉత్తర్వులు ఇస్తే 10న లుక్‌ఔట్ నోటీసులు ఎలా ఇస్తారని న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి ప్రశ్నించారు. దాడి జరిగిన రోజు సజ్జల మంగళగిరికి 500 కి.మీ దూరంలో ఉన్నట్టు కోర్టుకు ఆధారాలు కూడా సమర్పించామన్నారు. పోలీసులకు విచారించే అధికారం ఉన్నట్టు.. నిందితులకూ హక్కులు ఉన్నాయన్నారు. తెదేపా కార్యాలయంపై దాడి కేసును రకరకాలుగా తిప్పుతున్నారని, దీనిపై న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. వైకాపా అధికారంలో ఉండగా 2021 అక్టోబర్ 19న ఆ పార్టీకి చెందిన మూకలు తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడికి పాల్పడ్డాయి. దీనిపై కేసు నమోదు కావడంతో ఇప్పటికే పలువురు వైకాపా నేతలను పోలీసులు విచారించారు. ఈ కేసులో సజ్జల ప్రమేయం ఉందని గుర్తించిన పోలీసులు ఆయన విదేశాలకు వెళ్లకుండా ఇప్పటికే లుక్‌అవుట్ నోటీసులు జారీ చేశారు. పార్టీ కార్యాలయం పై దాడి కేసులో వైకాపా నేతలు లేళ్ల అప్పిరెడ్డి, దేవినేని అవినాశ్, తలశిల రఘురామ్‌లను ఇప్పటికే ఫలు దఫాలుగా పీఎస్‌కు పిలిపించి విచారించారు. కేసు కొలిక్కి వస్తున్న నేపథ్యంలో దాడి ఘటనలో ప్రమేయం

# కొండా దూకుడుతో హస్తం పార్టీకి తలనొప్పులు..



హైదరాబాద్,ఆమె ఓ ఫైర్ బ్రాండ్ లీడర్. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పట్టున్న కుటుంబం. పైగా క్రౌడ్ పుల్లర్స్. ఏ పార్టీలో ఉన్నా తమదైన ముద్ర వేసే చాణక్యం. బలమైన సామాజిక సమీకరణం. ఇంకేముంది జిల్లాలో కొండా దంపతులే పార్టీకి పెద్ద దిక్కు అనుకుంది కాంగ్రెస్. అయితే అమాత్య యోగం దక్కించుకున్న ఆమె%ౌ%ఇప్పుడు పార్టీకే కొండంత భారం అవుతున్నారట.ఆల్రెడీ సీతక్కకు ఓరుగల్లు జిల్లా కోటాలో మంత్రి పదవి ఇచ్చినా..రాజకీయ పలుకుబడి, బీసీ కార్డు ఉన్న కొండా సురేఖకు కూడా క్యాబినెట్లో అవకాశం కల్పించారు. అయితే వరంగల్ జిల్లా రాజకీయమంతా తన కనుసైగల్లోనే నడవాలన్నట్లుగా డామినేట్ చేస్తున్నారట కొండా సురేఖ. ఆ వ్యవహారమంతా అంతర్గతంగా నడుస్తుండగానే..కేటీఆర్తో కయ్యానికి దిగారు మంత్రిగారు.ఆయనను టార్గెట్ చేయబోయి ఓ నటిని వివాదంలోకి లాగి పెద్ద దుమారానికి కారణమయ్యారు. అటు బిఆర్ ఎస్, ఇటు సినీ ఇండస్ట్రీ కూడా కారాలు మిరియాలు నూరడమే కాదు%ౌ%కొండా సురేఖ సంగతి తేల్చేందుకు ఏకంగా కోర్టుల్లోనూ కేసులు వేశారు. ఆ కాంట్రవర్సీ నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది కాంగ్రెస్. అయినా ఆమె మీద యాక్షన్ తీసుకోకపోవడంపై రచ్చ జరుగుతూనే ఉంది. ఇంతలోనే మరో ఇష్యూతో పార్టీని రచ్చకీడ్చిశారు.

అగ్నికి ఆజ్యం

వరంగల్ ఈస్ట్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉన్న కొండా సురేఖ.. తన పాత నియోజకవర్గం పరకాలలో తరచూ తలదూరుస్తున్నారు. పరకాల నుంచి కాంగ్రెస్ తరపున గెలిచిన రేవూరి ప్రకాశ్రెడ్డిని కాదని.. మంత్రి డైరెక్ట్గా ఇన్వాల్వ్ అవుతున్నారట. తన అనుచరుల దూకుడుకు మద్దతుగా నిలుస్తూ అగ్నికి ఆజ్యం పోస్తున్నారు.దసరా సందర్భంగా పెట్టిన ఫ్లెక్సీ విషయంలో జరిగిన గొడవ కాస్త..గీసుకొండ పోలీస్ స్టేషన్ దాకా వెళ్లింది. మంత్రి హోదాలో ఉన్న కొండా సురేఖ స్వయంగా పోలీస్ స్టేషన్కు వెళ్లి..సీఐ సీటులో కూర్చొని హల్చల్ చేశారు. తన అనుచరుల జోలికి వస్తే ఖబడ్దార్ అంటూ హెచ్చరికలు జారీ చేశారు. ఇలా సీఐ సీట్లు ఆమె కూర్చోవడం సొంత పార్టీ ఎమ్మెల్యే రేవూరికి సవాల్ విసరడం వివాదాస్పదం అయ్యాయిఅప్పటికే కొండా సురేఖ మీద అంతర్గతంగా రగిలిపోతున్న వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు%ౌ% ఈ ఇష్యూ తర్వాత బరస్ట్ అయ్యారు. తమ నియోజకవర్గాల్లో ఆమె పెత్తనం ఏంటంటూ ఒక్కొక్కరు సీరియస్ అవుతున్నారు. మొన్నటి ఇష్యూతో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్రెడ్డి ఆగ్రహంతో ఉన్నారట. తన అనుచరులపై దాడులు చేయడమేంటని..మంత్రి తీరుతో ఇబ్బందులు వస్తున్నాయని పార్టీ ముఖ్యుల దగ్గర పంచాయితీ పెట్టారు.

జిల్లాలోని ఎమ్మెల్యేలంతా జట్టు

ఆమెను కంట్రోల్ చేయకపోతే.. పరిస్థితి చేయి దాటిపోతుందని స్పష్టం చేశారట. ఇదే అదనుగా రేవూరితో జిల్లాలోని ఎమ్మెల్యేలంతా జట్టు కట్టేశారు. సీఎం రేవంత్రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ దీపాదాస్ మున్షి దృష్టికి సురేఖ వ్యవహారాన్ని కలిసి కట్టుగా తీసుకెళ్లారు. అంతటితో ఆగకుండా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ను కలిసి ఫిర్యాదు చేసేందుకు ఢిల్లీకి కూడా వెళ్తున్నారు.ఒక్క రేవూరి ప్రకాశ్ రెడ్డి మాత్రమే కాదు..వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్రెడ్డి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, వరంగల్ మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ..కొండా సురేఖ తీరుపై గుర్రుగా ఉన్నారు. ఆమెను ఎలాగైనా మంత్రి పదవి నుండి దింపేయాల్సిందేననే పట్టుదలతో వీళ్లంతా అధిష్టానంకు ఫిర్యాదు చేసేందుకు కూడా రెడీ అయిపోయారు. పార్టీ ముఖ్యనేతలు కూడా కొండా సురేఖ విషయంలో సీరియస్గానే ఫోకస్ చేశారట. ఆమెను ఎలా కంట్రోల్ చేయాలనే దానిపై తర్జనభర్జన పడుతున్నారట. బీసీ నేత అందులోనూ.. మహిళ కావడంతో విషయం కాస్త సెన్సిటీవ్గా మారిందట. కానీ ఆమెను కట్టడి చేయకపోతే మునుముందు మరిన్ని ఇబ్బందులు తప్పేలా లేవని భావిస్తున్నారట.

ఎమ్మెల్యేల ఫిర్యాదుతో మరోసారి కార్నర్

ఇప్పటికే ఆమెపై కోర్టు దావాలు కొనసాగుతుండగా..సొంత జిల్లాలో, సొంత పార్టీ ఎమ్మెల్యేల ఫిర్యాదుతో మరోసారి కార్నర్ అయిపోయారు కొండా సురేఖ. ఇప్పటికే అధిష్టానం ఆమె మీద సీరియస్గా ఉండటం..ఇప్పుడు ఎమ్మెల్యేల ఫిర్యాదుతో ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ మాత్రం కొనసాగుతోంది. రాష్ట్ర ముఖ్యనేతలు కూడా ఆమె తలనొప్పిగా మారారని..ఎంత చెప్పినా వినట్లేదని..తాము చేసేదేం లేదన్నట్లుగా చెప్పుకొస్తున్నారట.అయితే వరుస వివాదాలతో కొండంత భారమైన సురేఖను మంత్రి పదవి నుంచి తప్పించేందుకే ఈ వ్యవహారం జరుగుతోందన్న టాక్ నడుస్తోంది. ఎమ్మెల్యేలను ఒకే తాటి మీదకు తేవడం..ఏకంగా ఢిల్లీకి పంపిస్తుండటం కూడా ప్లాన్లో భాగమేనన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ముఖాముఖి కూర్చోబెట్టి సమస్యను సాల్వ్ చేయాల్సింది బోయి.. హస్తినకు షిఫ్ట్ చేయడం అంటేనే ఏదో జరుగుతుందని చర్చించుకుంటున్నారట కొండా సురేఖ అనుచరులు. ఈ పంచాయతీకి కాంగ్రెస్ అధిష్టానం ఎలాంటి ముగింపు ఇస్తుందోననే ఆసక్తి మాత్రం సర్వత్రా నెలకొంది.

# కరవు నేలలో కుంభవృష్టి...



శ్రీ సత్యసాయి జిల్లా : ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదయింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఒకేరోజు ఏకంగా 1746.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది. అంతేకాకుండా జిల్లా వ్యాప్తంగా ఏకంగా సగటు వర్షపాతం ఒకే రోజులో 54.7 మిల్లీమీటర్ల వర్షం కురవడం విశేషం. జిల్లాలోని ప్రధాన చెరువులకు వర్షం నీరు చేరుతోంది. చిన్నచిన్న వంకలు, వాగులు పొంగిపొర్లుతున్నాయి.ప్రధానంగా కర్ణాటకలోని పరగోడు డ్యాం భారీ వర్షాలకు 80 శాతం పైగా నీరు చేరడంతో కర్ణాటకలో ఇక ఏమాత్రం వర్షాలు కురిసిన పరగోడు పొంగి చిత్రావతి నదిలోకి భారీగా వరద చేరే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే కలెక్టర్ టీఎస్ చేతన్ చిత్రావతి నదీ పరివాహక ప్రాంతంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఇసుక కోసం ఎడ్ల బండిలో వెళ్లే వారు, చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.అనేక చోట్ల చెరువులు నిండి మరవలు వస్తున్న కారణంగా చిన్నపిల్లలు, మహిళలు వాగులు, వంకల వైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ మేరకు ఇప్పటికే ఎస్పీ వి.రత్న ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు యంత్రాంగం ఆయా ప్రాంతాల్లో పర్యటించి ముందస్తు చర్యలు చేపట్టారు. మూడు రోజులుగా కురిసిన వర్షాలు కారణంగా పురాతన మిద్దెలు, చెట్లు పడిపోయే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు.

రికార్డు వర్షపాతం

ఇదిలా ఉండగా జిల్లాలో వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తచెరువు 110.6 మిల్లీమీటర్లు, బుక్కపట్నం 98.6, పెనుకొండ 90.2, రామగిరి 77.2, చెన్నై కొత్తపల్లి 71.8, ముదిగుబ్బ 71.8 రాప్తాడు 68.6, నల్లమాడ 67.0, గోరంట్ల 66.8, సోమందేపల్లి 61.6, ధర్మవరం 63.4, ఓబుల దేవర చెరువు 59.0, నల్లచెరువు 54.2, అమరాపురం 50.2, గాండ్లపెంట 44.8, కదిరి 44.8 అమడగూరు 42.8, నంబుల పూలకుంట 41.8 తనకల్లు, 40.4, కనగానపల్లె 39.0, మడకశిర 38.4 , పరిగి 34.0 తాడిమర్రి 32.4, బత్తలపల్లి 31.8, చిలమత్తూరు 30.2, హిందూపురం 27.8 ,అగళి26.7, లేపాక్షి 23. 8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

నందికొట్కూరు జల దిగ్బంధం

రెండు రోజులుగా దంచి కొడుతుండటంతో నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణం జలమయమైంది. బుధవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షంతో హాజీ నగర్, మారుతి నగర్ కాలనీలు నీట మునిగాయి. ఇక ప్రధాన రహదారులపై మోకాలు లోతులో నీరు ప్రవహిస్తోంది. ఇళ్లలోకి వరద నీరు చేరి ప్రజలు ఇబ్బంది పడ్డారు.

# 30 ఏళ్లుగా మహారాష్ట్రలో సంకీర్ణ ప్రభుత్వాలే...

ముంబై:మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు నవంబర్ 20న జరగనున్న విషయం తెలిసిందే. ఎన్నికల ఫలితాలు నవంబర్ 23న వెలువడుతాయి. మహారాష్ట్రలో ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయన్నది ఎంత ఆసక్తికరంగా ఉంటుందో.. ఏ కూటమికి ఎన్ని సీట్లు వస్తాయన్నదీ అంతే ఆసక్తికరంగా మారుతుంది.ఆ రాష్ట్రంలో దాదాపు 30 ఏళ్లుగా సింగిల్ పార్టీ ఇప్పటివరకు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయింది. అంటే 1995 నుంచి ఇప్పటివరకు ఆ రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వాలే అధికారంలో ఉంటున్నాయి. సింగిల్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం గగనంగా మారింది. పొత్తు లేకుండా సర్కారును ఏర్పాటు చేయలేకపోతున్న పార్టీలు ఈ సారి కూడా పొత్తులనే నమ్ముకున్నాయి.

1990లో సింగిల్గా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్

కాంగ్రెస్ పార్టీ మహారాష్ట్రలో 1990లో సింగిల్గా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. పొత్తులు అవసరం లేనంత మెజార్టీ ఆ పార్టీకి వచ్చింది. మహారాష్ట్రలో 1990లో కాంగ్రెస్ పార్టీ 141 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆ ఎన్నికల్లో బీజేపీ 42, శివసేన 52 సీట్లు గెలుచుకున్నాయి.

1995 నుంచి ఇప్పటివరకు ఏయే ప్రభుత్వాలు

శివసేనకు 1995 ఎన్నికల్లో 73, బీజేపీకి 65 సీట్లు దక్కాయి. ఆ రెండు పార్టీలు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. అప్పటి నుంచి ఇప్పటివరకు మహారాష్ట్రలో సంకీర్ణ ప్రభుత్వాలే ఉన్నాయి. మహారాష్ట్రలో మొట్టమొదటి సంకీర్ణ ప్రభుత్వం ఇది కాదు. అంతకు ముందు 1978లో కాంగ్రెస్ (ఓ), కాంగ్రెస్ (ఇందిర) కలిసి ఎమర్జెన్సీ తర్వాత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి.బాల్ థాకరే స్థాపించిన శివసేన 1972లో ఒక సీటు గెలుచుకోవడం ద్వారా అసెంబ్లీలోకి అరంగేట్రం చేసింది. ఇక 1978 తర్వాత 1980లో 'ఇందిరా కాంగ్రెస్' 186 సీట్లు గెలుచుకుని మళ్లీ అధికారంలోకి వచ్చింది. 1995లో శివసేన-బీజేపీ కూటమి అధికారంలోకి రావడంతో 45 మంది కాంగ్రెస్ తిరుగుబాటుదారులు స్వతంత్ర అభ్యర్థులుగా గెలిచి కాషాయ పాలనకు మద్దతు ఇవ్వడంతో ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ ఆధిపత్యం ముగిసింది. 1999 అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్లో చీలిక వచ్చి శరద్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటైంది.అప్పట్లో కాంగ్రెస్ పార్టీ 75 సీట్లతో అతిపెద్ద



పార్టీగా అవతరించగా, ఎన్సీపీ 58 స్థానాలను గెలుచుకుంది. అధికార శివసేన 69, బీజేపీ 56 స్థానాలు గెలుచుకుని అధికారాన్ని కోల్పోయాయి. కాంగ్రెస్, ఎన్సీపీలు వేర్వేరుగా ఎన్నికల్లో పోటీ చేసినా ప్రభుత్వ ఏర్పాటుకు ఒక్కటయ్యాయి.ఆ తర్వాత 15 ఏళ్ల పాటు కూటమి పాలించింది. 2014లో నాలుగు పార్టీలు విడివిడిగా పోటీ చేశాయి. ఆ ఎన్నికల్లో బీజేపీకి 122, శివసేనకు 63, కాంగ్రెస్కు 42, ఎన్సిపికి 41 సీట్లు వచ్చాయి. శివసేన ఏర్పాటైన నెల తర్వాత దేవేంద్ర ఫడ్నవీస్ నేతృత్వంలోని బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వంలో చేరింది. 2019 ఎన్నికల్లో బీజేపీ, శివసేన కలిసి పోటీ చేశాయి. బీజేపీ 105, శివసేన 56 స్థానాల్లో గెలుపొందడంతో, కూటమి అధికారాన్ని నిలబెట్టుకోవడానికి సిద్ధంగా ఉన్న సమయంలో ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన ముఖ్యమంత్రి పదవి కోసం పట్టుబట్టడంతో ఇరు పార్టీలు విడిపోయాయి.అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ వర్గంతో కలిసి శివసేన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. సంఖ్యాబలం లేకపోవడంతో అది మూడు రోజుల్లోనే కూలిపోయింది. దీంతో కాంగ్రెస్, ఎన్సీపీతో కలిసి శివసేన మహా వికాస్ అఘాడీ ఏర్పాటు చేసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ 44, ఎన్సీపీ 54 సీట్లు గెలుచుకున్నాయి.ఠాక్రే నేతృత్వంలోని మూడు పార్టీల ప్రభుత్వం జూన్ 2022 వరకు కొనసాగింది. ఆ సమయంలో శివసేన నాయకుడు ఏక్నాథ్ షిండే తిరుగుబాటు చేసి ప్రభుత్వాన్ని పడగొట్టారు. షిండే సేనను చీల్చి బీజేపీతో చేతులు కలిపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు.

# జమిలీ ఎన్నికలొస్తున్నాయి మళ్లీ మనమే..



అమరావతి,జమిలీ ఎన్నికలు రాబోతున్నాయని.. మళ్లీ మనమే అధికారంలోకి వస్తామని ఏపీ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ కీలక సూచనలు చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో పార్టీ జిల్లా అధ్యక్షులు, అనుబంధ సంఘాల నేతలతో సమావేశమైన ఆయన పలు అంశాలపై చర్చించారు. జమిలీ ఎన్నికలు అంటున్నారని, పార్టీ నేతలు సిద్ధంగా ఉండాలని సూచించారు. అన్ని కమిటీలు పూర్తి స్థాయిలో పని చేయాలని సూచించారు. ఇంట్లో కూర్చుంటే ఏమీరాదని, సమస్యలపై పోరాటాలు చేయాలని చెప్పారు. అన్యాయాలపై ధర్నాలు, నిరసనలు తెలిపాలని, బాధితులకు అండగా నిలవాలని తెలిపారు. అలా చేస్తేనే ప్రజల్లో ఉధృతమైన స్పందన వస్తుందన్నారు. కష్టపడిన వారికి పార్టీలో అవకాశాలు లభిస్తాయని జగన్ పేర్కొన్నారు.నియోజకవర్గాల వారీగా త్వరలో సమీక్షలు నిర్వహిస్తామని, ఇంచార్జుల పని తీరు మెరుగుపర్చుకోవాలని, చురుగ్గా పని చేసిన వాళ్లకు రేటింగ్స్ ఇస్తామని పార్టీ నేతలకు జగన్ సూచించారు. పూర్తి స్థాయిలో కార్యవర్గాలను ఏర్పాటు చేయాలని నేతలకు పిలుపునిచ్చారు. త్వరలోనే అన్ని నియోజకవర్గాల్లో సమీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. మంగళగిరి, రేపల్లె నియోజకవర్గాలకు కొత్త ఇంచార్జులను నియ మించామని, త్వరలో మరికొన్ని నియోజకవర్గాలకు ఉంటాయని పేర్కొన్నారు. బూత్ లెవర్ కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ నేతలకు జగన్ సూచించారు.

# ధర్మాన ప్రసాదరావు ఎందుకు సైలెంట్ అయినట్లు?

విజయవాడ:ధర్మాన ప్రసాదరావు. నాన్ కాంట్రవర్సీ లీడర్. నేదురుమల్లి జనార్దన్ రెడ్డి మొదలు.. వైఎస్ జగన్ వరకు అనేక మంది సీఎంల క్యాబినెట్లో కీలక శాఖలు నిర్వహించారు. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన ధర్మాన.. హోదా, స్థాయి, గౌరవానికి తగ్గట్లుగా.. సాదాసీదాగా పని చేసుకుంటూ వెళ్తుంటారు.అధికారంలో ఉన్నా.. అపోజిషన్లో ఉన్నా హుందాగా వ్యవహరిస్తుంటారు. అయితే మొన్నటి ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆయన సైలెంట్ అయిపోయారు. అప్పుడూ, ఇప్పుడూ ఎప్పుడూ ధర్మాన అగ్రెసివ్ పాలిటిక్స్కు దూరంగా ఉంటారు. ప్రత్యర్థులపై అనవసరంగా నోరు పారేసుకోరు. దీంతో ఆయనకు రాజకీయంగా కూడా శత్రువులు తక్కువే. అలాగని విధానపరంగా ఎవరినీ విమర్శించకుండా విడిచి పెట్టరు ధర్మాన.వైసీపీ హయాంలో విశాఖ రాజధాని నినాదం నెత్తిన పెట్టుకుని మరీ మోశారు. అవసరమైతే ప్రాణత్యాగాలకు కూడా సిద్ధమంటూ ప్రకటించారు. అలాంటి సీనియర్ నేత ఇప్పుడు మౌనంగా ఉండిపోవడం కార్యకర్తలకు కూడా నచ్చడం లేదట. ధర్మాన ప్రసాదరావు అంటే ఏదో ఒక నియోజకవర్గానికి పరిమితమైన నాయకుడు కాదు.

2024 ఎన్నికల ముందే చెప్పిన ధర్మాన

ఆయన కనుసన్నల్లోనే సిక్కోలు రాజకీయాలు నడుస్తూ వచ్చేవి. ఇప్పుడు ప్రతిపక్షంలో పార్టీని ముందుకు నడిపించాల్సిన సమయంలో ఆయన మౌనం ద్వితీయ స్థాయి నేతలకు అంతు పట్టడం లేదట. సార్ ఇలా వచ్చి కనబడిపోతే చాలు శ్రీకాకుళం నియోజకవర్గ వైసీపీలో మళ్లీ జోష్ వస్తుందని అనుకుంటున్నారట. 2024 ఎన్నికల ముందే ప్రత్యక్ష రాజకీయాల నుంచి దూరంగా ఉండాలనుకుంటున్నట్లు చెప్పారు ధర్మాన.కానీ అధినేత ఒప్పుకోలేదని మరోసారి బరిలో నిలవాలని చెప్పారంటూ ఎన్నికల సభలలో చెప్పుకుంటూ వచ్చారు. అయితే ఇప్పుడు పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలకు కూడా దూరంగా ఉంటున్నారు ధర్మాన.వైసీపీ అధినేత జగన్ నిర్వహించిన శ్రీకాకుళం జిల్లా సమీక్షా సమావేశాలకు కూడా ధర్మాన ప్రసాదరావు అటెండ్ కాలేదు. తన సోదరుడు కృష్ణదాస్ జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన కార్యక్రమానికి కూడా ధర్మాన ప్రసాదరావు హాజరు కాలేదు. అన్నివర్గాల్లో మంచి పేరున్న ధర్మాన జిల్లా రాజకీయాల్లో యాక్టివ్గా లేకపోవడం క్యాడర్ను,



లీడర్లను నిరాశలో పడేసిందట.

రాం మనోహర్ నాయుడు కూడా అంతే..

ధర్మాన ప్రసాదరావు పూర్తిగా ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉండాలనుకుంటున్నారా లేక సరైన సమయంలో యాక్టివ్ కావాలనుకుంటున్నారా అంటూ పార్టీలో చర్చ సాగుతుంది. ఇక ధర్మాన ప్రసాదరావు కుమారుడు రాం మనోహర్ నాయుడు కూడా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు.త్వరలో కార్పొరేషన్ ఎన్నికలు వస్తుండటంతో తమ నాయకుడు సైలెంట్గా ఉంటే ఎలా అని చర్చించుకుంటున్నారట క్యాడర్. అయితే ధర్మాన అంటే సైలెంట్ పాలిటిక్స్. ఎలాంటి హడావుడి లేకుండా రాజకీయాలను చక్కబెట్టడంలో ఆయన రూటే సెపరేటు. అందుకే తమ నేతకు ఏదో ఓ ప్లాన్ ఉండే ఉంటుందని అనుకుంటున్నారట కార్యకర్తలు. కానీ తమ నాయకుడి మదిలో ఏముందో తెలుసుకోలేక పోతున్నారట.

## ర్యాష్ డ్రైవింగ్ వద్దన్నందుకు దాడి

హైదరాబాద్,సికింద్రాబాద్ పరిధిలో అల్వాల్లో దారుణం చోటు చేసుకుంది. బైక్పై ర్యాష్గా వెళ్లొద్దని చెప్పినందుకు ఆంజనేయులు అనే వృద్ధుడిపై ఓ యువకుడు దాడి చేశాడు. తీవ్రగాయాలపాలైన వృద్ధుడు.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. 10 రోజుల క్రితం దాడి ఘటన జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. రూ.లక్షలు ఖర్చుపెట్టినా ప్రాణం దక్కలేదని మృతుడి కుమారుడు వాపోయాడు.

# పౌరసత్వ చట్టంలోని సెక్షన్-ఎ రాజ్యాంగబద్ధమే..



న్యూఢిల్లీ, పౌరసత్వ చట్టం 1955లోని సెక్షన్ఏ రాజ్యాంగబద్ధతను సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం సమర్థించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోమిశ్రా ధర్మాసనం 4:1 మెజారిటీతో రాజ్యాంగబద్ధతను సమర్థిస్తూ గురువారం తీర్పును వెలువరించింది. అయితే, న్యాయమూర్తుల్లో జస్టిస్ పార్దివాలా మాత్రమే రాజ్యాంగ విరుద్ధమంటూ అభిప్రాయం వ్యక్తం చేశారు. విదేశీయుల ను భారత పౌరులుగా గుర్తించినా.. పదేళ్ల వరకు ఓటేసే హక్కు ఉండదన్నారు. బంగ్లాదేశ్ (గతంలో తూర్పు పాకిస్థాన్) నుంచి శరణార్థుల రాక అసోం జనాభా సమతౌల్యతను తీవ్రంగా ప్రభావితం చేసిదంటూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 6ఎ రాష్ట్రంలోని అసలైన నివాసితుల రాజకీయ, సాంస్కృతిక హక్కులను ఉల్లంఘించిందని పిటిషన్లు ఆరోపించారు. విచారణ సందర్భంగా సీజేఐ డీవై చంద్రచూడ్ మాట్లాడుతూ అక్రమ వలసలకు అసోం అకార్డ్ రాజకీయ పరిష్కారమని.. సెక్షన్-6ఎ అనేది చట్టబద్ధమైన మార్గమని పేర్కొన్నారు. నిబంధనలు రూపొందించేందుకు మెజార్టీతో కూడిన పార్లమెంట్కు ఆ శక్తి ఉందన్నారు. మానవీయ ఆందోళనలను పరిష్కరించడంతోపాటు స్థానికుల ప్రయోజనాలను కాపాడే సమతౌల్యత సెక్షన్కు ఉందని.. ఇందులో కటాఫ్ డేట్గా నిర్ణయించిన 1971 మార్చి 25 అనేది సరైనదేనన్నారు. ఎందుకంటే అప్పటికే బంగ్లాదేశ్ యుద్ధం ముగిసిందని. బంగ్లాదేశ్ యుద్ధం నేపథ్యంలోనే ఈ సెక్షన్ తీసుకొచ్చిన విషయాన్ని చెబుతోందని..ఈ సెక్షన్ అంత ఎక్కువగా జనాభాను కలుపుకోలేదని.. మరీ తక్కువగాను విలీనం చేసుకోలేదని సీజేఐ వ్యాఖ్యానించా రు. పౌరసత్వ చట్టం 1955 సెక్షన్6ఎ మేరకు 1966 జనవరి నుంచి 1971 మార్చి 25లోపు అసోంకు వచ్చిన వలసదారులు పౌరసత్వం కోరవచ్చు.ఈ రూల్ని 1985లో అసోం అకార్డ్ తర్వాత తీసుకువచ్చారు.అసోంలోకి బంగ్లాదేశ్ వలసలపై ఉద్యమించినవారితో కేంద్రప్రభుత్వం చేసుకున్న ఒప్పందం ఇది.దీని చట్టబద్ధతపై అసోంలోని కొన్ని స్థానిక గ్రూపులు సుప్రీంకోర్టు లో సవాల్ చేశాయి. రాజ్యాంగ పీఠికకు విరుద్ధమని, పౌరహక్కుల ఉల్లంఘనతో పాటు రాజకీయ హక్కులను హరించడమేనని వాదించాయి.

## వాహనాలతో తిరుమలలో పర్యావరణ సమస్యలు

తిరుమల,తిరుమలలో పర్యావరణ సమస్యలతో పాటు వాహనాల రాకపోకలు నానాటికీ పెరుగుతున్న దృష్ట్యా తిరుమల ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ మేనేజ్మెంట్ సిస్టమ్ (టిఐటిఎంఎస్) తక్షణమే అవసరమని టీటీడీ అడిషనల్ ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి అన్నారు. గురువారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో సీవీఎస్వో శ్రీధర్, ఎస్పీ సుబ్బరాయుడుతో కలిసి ట్రాఫిక్ (÷సజౌతిఇ) నిర్వహణపై సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ట్రాఫిక్ నిర్వహణకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలను తయారు చేయాలని పేర్కొన్నారు. టీటీడీ కాప్స్, తిరుమల పోలీస్, ఆర్టీఏ, టౌన్ ఎ÷-లానింగ్, ఏపీఎస్ఆర్టీసీ, ఇంజినీరింగ్, రెవెన్యూ, జీఎం ట్రాన్స్పోర్ట్ సభ్యులుగా ఉన్న కో-ఆర్డినేషన్ కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలను అంచనా వేసి వారంలోగా సిఫార్సులు అందజేయాలని కోరారు. తిరుమలలో ట్రాఫిక్ రద్దీ పాయింట్లయిన గోకులం, ఏటీసీ, రాంభగీచా, తదితర ప్రాంతాలను గుర్తించాలని, దర్శనం వచ్చే భక్తుల కోసం నిర్దిష్ట మార్గాలు , పార్కింగ్ స్థలాలను కేటాయించాలని సూచించారు. ట్రాఫిక్ రద్దీని నివారించడానికి అదనపు బలగాల కేటాయింపు, అన్ని భవిష్యత్ నిర్మాణాలలో, మల్టీ-లెవల్ పార్కింగ్ సౌకర్యాలు తప్పనిసరి చేయాలని అన్నారు. డిజిటల్తో ట్రాఫిక్, పార్కింగ్ అప్డేట్ల కోసం ప్రత్యేకమైన మొబైల్ యాప్ను తయారు చేయాలని వెల్లడించారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com